Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4
సంచిక : 85

శుక్రవారం,
సెప్టెంబర్,8,2023

పేజీలు - 8 వెల- రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## సోషల్ మీడియాలో కాంగ్రెస్ దూకుడు

న్యూఢిల్లీ, 2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) 285 సీట్లతో, దాని స్వంత మెజారిటీతో అధికారంలోకి వచ్చినప్పుడు ఇతర విషయాలతో పాటు సోషల్ మీడియా దీనికి చాలా క్రెడిట్ ఇచ్చింది.ఫేస్ బుక్, యూట్యూబ్, ట్విట్టర్ వంటి వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కాంగ్రెస్‌పై బీజేపీ సాధించిన భారీ విజయంలో కీలక పాత్ర పోషించాయి. తన అభివృద్ధి నమూనాతో గుజరాత్‌ను అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లిన వికాస్ పురుష్‌గా తన ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీని ప్రదర్శించడానికి బిజెపి దానిని చాలా సమర్థవంతంగా ఉపయోగించుకుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇమేజ్ క్షీణించడానికి, అతనిని పప్పు లేదా తెలివితక్కువ వ్యక్తిగా ముద్రించడానికి పార్టీ సోషల్ మీడియాను బాగా ఉపయోగించడం కనిపించింది. ప్రేమ, యుద్ధంలో అన్నీ న్యాయమే అని 2014లో బీజేపీ పేర్కొంది..తొమ్మిదేళ్ల తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కనీసం మైదానంలో కాకపోయినా.. ఈరోజుల్లో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నది కాంగ్రెస్సే. జూన్ 2022లో కాంగ్రెస్ కొత్త సోషల్ మీడియా టీమ్‌ను ఏర్పాటు చేయడంతో ఇదంతా ప్రారంభమైంది.



## 16న పాలమూరు రంగారెడ్డి వెట్ రన్

హైదరాబాద్, : పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల వెట్ రన్ కు ముహూర్తం ఖరారు అయింది. ప్రపంచంలోనే భారీ పంపులతో ఈ ఎత్తిపోతలను నిర్మించినట్లుగా ప్రభుత్వం చెబుతోంది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల డ్రైన్‌ను అధికారులు విజయవంతంగా నిర్వహించారు. ఈ క్రమంలో తాజాగా వెట్ రన్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16న వెట్ రన్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నార్లాపూర్ ఇన్‌టేక్ వద్ద స్విచ్ ఆన్ చేసి వెట్ రన్ ప్రారంభం చేయనున్నారు. వెబ్ రన్‌లో భాగంగా 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు.



## ఉక్రెయిన్‌కు యురేనియం ట్యాంక్ షెల్స్‌ను పంపనున్న అమెరికా

న్యూయార్క్: ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంక్‌లను అమెరికా అందజేయనున్న విషయం తెలిసిందే. అబ్రామ్స్ యుద్ధ ట్యాంక్‌ల్లో వాడే యురేనియం షెల్స్ ను సరఫరా చేసేందుకు అమెరికా సిద్ధమైంది. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు ఆయుధాలను అమెరికా సరఫరా చేస్తున్నది. అయితే వివాదాస్పద యురేనియం ట్యాంక్ షెల్స్‌ను ఉక్రెయిన్‌కు ఇవ్వడాన్ని రష్యా ఖండిస్తోంది. ఇటీవల అమెరికా దౌత్యవేత్త ఆంటోనీ బ్లింకెన్ ఉక్రెయిన్‌లో పర్యటించారు. ఆ సమయంలోనే 120ఎంఎం యురేనియం ట్యాంక్ రౌండ్లను సరఫరా చేసేందుకు అమెరికా అంగీకరించింది. వీటిని ఎం1 అబ్రామ్స్ ట్యాంకుల్లో వాడనున్నారు. అయితే ఈ ఏడాది చివరకు వరకు ఈ ఆయుధాలను ఉక్రెయిన్‌కు చేరవేయనున్నారు. డిప్లీటెడ్ యురేనియం ఆయుధాలను దాడులకు వాడనున్నారు. క్షీణించిన యురేనియంను షెల్లింగ్ ఆయుధాలకు ప్లేటింగ్‌గా వాడుతారు.



## నేడు భారత్‌కు జో బైడెన్ రాక..

### మూడంచెల భద్రత ఏర్పాటు

న్యూఢిల్లీ : భారత్ వేదికగా జరగనున్న జీ20 సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో జో బైడెన్ శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఢిల్లీకి చేరుకోనున్నారు. దీంతో ఢిల్లీ పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అమెరికా అధ్యక్షుడు ది బీస్ట్ కారులో ప్రయాణించనున్నారు. ఈ కారు బోయింగ్ సీ-17 విమానంలో యూఎస్ నుంచి ఢిల్లికి చేరుకోనుంది. ఇక బైడెన్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్‌పీజీ), పారా మిలటరీ దళాలు, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్స్ భద్రత నిర్వహించనున్నారు. జీ20 సమ్మిట్‌కు వచ్చే జో బైడెన్ ఢిల్లీలోని ఐటీసీ మౌర్య షెర్టాన్ హోటల్‌లో బస చేయనున్నారు. దీంతో హోటల్‌ను భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ హోటల్‌లోని 14వ అంతస్తులో బైడెన్ బస చేయనున్నారు. బైడెన్ ఉన్నంత వరకు ఆ హోటల్ వద్ద నిత్యం తనిఖీలు నిర్వహించనున్నారు. 14వ అంతస్తును సందర్శించే వారికి ప్రత్యేక పాసులు జారీ చేయనున్నారు. బైడెన్ కోసం ప్రత్యేక లిఫ్ట్ కూడా ఏర్పాటు చేశారు.

## సెల్ఫీ తీసుకుని ఫోటోల చేరవేత

బెంగళూరు, : ఆదిత్య ఎల్1 మిషన్ లక్ష్యం దిశగా దూసుకెళ్తోంది. సూర్యుడి రహస్యాలు చేధించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇటీవల రోదసిలోకి ఆదిత్యను పంపించిన సంగతి తెలిసిందే. భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్ దిశగా అది పయనిస్తోంది. అయితే అందుకు దాదాపు 4 నెలల సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ప్రయోగించిన తొలి 16 రోజులు భూకక్ష్యల్లోనే చక్కర్లు కొట్టనుంది. ప్రస్తుతం భూకక్ష్యలోనే తిరుగుతున్న ఆదిత్య ఎల్1 అద్భుతమైన ఫొటోలను తీసింది. ఆదిత్య ఎల్1 మిషన్ ఒక అదిరిపోయే సెల్ఫీ తీసుకుంది. ఇందులో ఎల్1 మిషన్ కనిపించింది. ఇక మరో అత్యద్భుతమైన ఖగోళ దృశ్యాన్ని ఆదిత్య ఎల్1 మిషన్ బంధించింది.



## దూసుకుపోతున్న ఆదిత్య

హైదరాబాద్ : ఈనెల 15న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించే 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ప్రారంభం అవుతున్న కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం మెడికల్ కాలేజీల్లో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు.ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం వైద్యారోగ్యశాఖ అధికారులతో మంత్రి హరీష్ రావు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్ రావు, హెల్త్ సెక్రెటరీ రిజ్వి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జి శ్రీనివాసరావు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, కాళోజీ వర్సిటీ వీసీ కరుణాకర్ రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..



## 15న మరో 9 మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

## రాహుల్ భారత్ జోడోకు ఏడాది పూర్తి

### వార్షికోత్సవం సందర్భంగా వీడియో పోస్ట్



న్యూఢిల్లీ: భారతదేశంలో విద్వేషాన్ని నిర్మూలించేవరకు, దేశాన్ని సమైక్యంగా ఉంచేంతవరకు తన జోడోయాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 7వ తేదీన రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు 4,000 కిలోమీటర్ల భారత్ జోడో యాత్ర ప్రారంభించారు. భారత్ జోడో యాత్ర ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎక్స్‌లో(ట్విట్టర్) ఒక వీడియోను పోస్టు చేశారు. ఐక్యత, ప్రేమ కోసం భారత్ జోడో యాత్రకు సంబంధించిన కోట్లాది అడుగులు దేశానికి మెరుగైన భవిష్యత్తుకు పునాదిగా మారాయని రాహుల్ పేర్కొన్నారు. దేశంలో విద్వేషాన్ని నిర్మూలించి దేశం సమైక్యంగా ఉండేవరకు ఈ యాత్ర కొనసాగు తుందని, ఇదే తన వాగ్దానమని రాహుల్ పేర్కొన్నారు.




## తిరుమలలో చిక్కిన మరో చిరుత..

తిరుమల: తిరుమలలో మరో చిరుత చిక్కింది. గురువారం తెల్లవారుజామున అలిపిరి మెట్లమార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం-7వ మైలు మధ్య ప్రాంతంలో బోనులో చిక్కింది. దీంతో రెండు నెలల వ్యవధిలో ఐదు చిరుతలను అధికారులు పట్టుకున్నట్లయింది. నాలుగు రోజుల క్రితంమే ట్రాప్ కెమెరాలకు చిక్కిన విషయం తెలిసిందే. నెల్లూరు చిన్నారి లక్షిత మృతదేహం లభించిన చోట ఏర్పాటు చేసిన బోను వద్ద సంచరించిన చిరుతపులి మళ్లీ కనిపించకుండా పోయింది. దీంతో దానిని బంధించడానికి చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో నేడు అది బోనుకు చిక్కడంతో అధికారులు, భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. గత నెలలో తిరుమల కొండపైకి నడకమార్గంలో వెళ్తున్న నెల్లూరు జిల్లాకు చెందిన ఆరేళ్ల బాలికను అలిపిరి వద్ద చిరుత పులి దాడిచేసి హతమార్చిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమయిన అధికారులు తిరుమల గిరుల్లో పలు ప్రాంతాల్లో బోనులు ఏర్పాటు చేశారు. దీనికితోడు నడక మార్గంలో పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. గత నెలలోనే అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనుల్లో మూడు చిరుతలు చిక్కాయి. అంతకుముందు చిరుత కూనను పట్టుకున్నారు.

## రాజన్న గుడిలోని దర్గాకు తాళం

రాజన్న సిరిసిల్ల : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఉన్న దర్గాకు పట్టణ సిఐ కరుణాకర్ తాళం వేసారు. దర్గా నిర్వహణ లో ఇద్దరు ముస్లిమ్ ల మధ్య తగాదాలు ఏర్పడ్డాయి. దాంతో వారి పంచాయతీ ఠా0ణ కు చేరింది. సమస్య పరిష్కరం జరిగే వరకు దర్గాకు తాళం వేయాలని పోలీసులు నిర్ణయించారు. కోర్ట్ లో కేసు ఉన్న వారి మధ్య వివాదం ఏర్పడం తో పరిష్కరం జరిగే వరకు ఎవ్వరు దర్గా వైపు రావద్దని సిఐ సూచించారు.

## ప్రజానాడి




## కోట్లాది నిధులతో క్షేత్ర అభివృద్ధి - సంక్షేమ శాఖల మంత్రి ఈశ్వర్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి సెప్టెంబర్ 07 (ప్రజా మంటలు) :రాష్ట్రంలోని సుప్రసిద్ధ సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం అయిన ధర్మపురికి అభివృద్ధి పనులకు కోట్లాది నిధులు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ధర్మపురి పట్టణంలో గురువారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మంత్రి ఈశ్వర్ కాలినడకన యాత్రలో పాల్గొనగా ఆయా వాడల్లో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి ని వార్డు ప్రజలనుండి అడిగి తెలుసుకున్నారు.. ఈసందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ ... తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని అన్ని వర్గాలను ప్రోత్సహించేలా సంక్షేమ పథకాలతో పాటు తాగు, సాగు నీరు, రహదారుల నిర్మాణం విద్య, వైద్య రంగంలో అద్భుత ప్రగతి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల మాత్రమే సాధ్యమైందని అన్నారు. 50 ఏండ్లకు పైగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికిని సాధించింది శూన్యమని బాగుపడ్డ ఊర్లు, వ్యక్తులు లేరని ఆయన ఎద్దేవా చేశారు. ఇక రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో రైతులకు 3 గంటల కరెంట్ చాలు అనే వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ పార్టీ విదానాలను చెప్పకనే చెప్పిందని గుర్తుచేశారు. మాయ మాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దని ఆపార్టీకి ఓటువేస్తే నిండా మునగడం ఖాయమని



పేర్కొన్నారు.. మున్సిపల్ ఏర్పాటుకు జనాభా సరిపోకున్న పుణ్యక్షేత్రం కావడం ముఖ్యమంత్రి కేసిఆర్ కి తాను అభ్యర్థించడం తో గ్రామపంచాయతీ గా ఉన్న ధర్మపురి మున్సిపల్ గా రూపాంతరం

చెంది నిధులు మంజూరు అయి ఎంతో అభివృద్ధి కి నోచుకుందని అన్నారు క్షేత్ర అభివృద్ధికి 160 కోట్లకు పైగా నిధులు మంజూరు తో 50 శాతం కు పైగా పనులు పూర్తయి పట్టణ రూపురేఖలు మారిపోయాయని మిగిలిన మంజూరునుండి మరో 6 నెలల్లోగా పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

ప్రజా ఆశీర్వాద యాత్ర ద్వారా ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకోవడం జరిగిందని నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి ధర్మపురి ఎమ్మెల్యే గా గెలిపించాలని ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆయన వార్డ్ ప్రజలను అభ్యర్థించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు జెడ్పీటీసీ అరుణ, మార్కెట్ చైర్మన్ రాజేశ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, ఏ ఎం సి వైస్ చైర్మన్ సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, కౌన్సిలర్లు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# విద్యారంగంలో పేరుకుపోయిన స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి



తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన 5 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జగిత్యాల జిల్లా బి.సి సంక్షేమ సంఘం డిమాండ్. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన 5 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగంలో డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ తదితర ఉన్నత విద్యలను అభ్యసించే విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా చెల్లించాల్సిన 5 వేల కోట్ల రూపాయల ఫీజు రియాంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 14 లక్షల మంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థుల భవితవ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా బీసీ నాయకులు డిమాండ్ చేశారు. విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం రేపటి తరానికి ఆటంకం లేని విద్యను అందించడంలో మాత్రం విఫలమైందని వారన్నారు. ఫీజు బడ్జెట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో విద్యార్థులు మానసికంగా వేదనకు గురవుతున్నారని దీంతో విద్యాభ్యాసం పై సరిగా దృష్టి సారించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 295 బిసి కళాశాల వసతి గృహాలకు, 321 బిసి గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంత భవనాలు లేవని వాపోయారు. ఉన్నత విద్యలను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ లు గా, శాస్త్రవేత్తలుగా, డాక్టర్లు గా, ఇంజనీర్లు గా కావాల్సిన విద్యార్థులకు అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తీరు మార్చుకొని విద్యారంగంపై ప్రత్యేక దృష్టిసారించాలి, బకాయి పడిన ఫీజు రియాంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయాలని, గురుకుల పాఠశాలలు మరియు హాస్టల్ భవనాలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ తదితర ఉన్నత విద్యలనభ్యసించే 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గత రెండేళ్లుగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు కోరుతుంటే ప్రభుత్వం మాత్రం వైన్స్ షాపులు, బెల్ట్ షాపులపై పెట్టే శ్రద్ధను విద్యారంగంపై ఉంచడం లేదని విమర్శించారు. కళాశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి 20 వేల రూపాయల చొప్పున స్కాలర్షిప్ లను అందజేయాలని అన్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడం కారణంగా వేలాదిమంది విద్యార్థులు ఉన్నత విద్యలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను అమ్మడం మానేసి ఆ స్థలాల్లో గురుకుల పాఠశాలలను, కళాశాల భవనాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్, సహ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీకూరి శ్రీహరి, జిల్లా బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు జాజాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ సామ్రాట్, బి.సి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# భారత్ జోడో యాత్ర ఒక చారిత్రక ఘట్టం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల సెప్టెంబర్ 07(ప్రజామంటలు):**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి స్వర్గీయ శ్రీ జువ్వాడి రత్నాకర్ రావు ఆశయ సాధకులు,కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు సూచనలతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో భారత్ జోడో యాత్ర కు సంబంధించిన మొదటి సంవత్సరం విజయోత్సవ పాదయాత్రను నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి అనేది తిరోగమనంలో ఉందని, పాతాళానికి చేరిందని, దానికి బదులుగా మత విద్వేషం, మత ప్రాతిపదికన సమాజ విభజన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న శక్తుల నుండి దేశాన్ని కాపాడుతూ, దేశ ప్రజలంతా ఐక్యంగా సమైక్యంగా ఉంచాలనే గొప్ప ఆశయంతో, మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుంటూ,వారి బాధలను వింటు వాళ్ళకు భరోసా ఇస్తూ కన్యాకుమారి నుంచి ఆసేతు హిమాచలం కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్ల (4081) పైగా భారత్ జోడో యాత్ర చేపట్టి, యాత్రలో 12 రాష్ట్రాలతో పాటుగా,2 కేంద్ర పాలిత ప్రాంతలను కలుపుకుంటూ కొన్ని కోట్ల మంది ప్రజల అభిమానాలను సొంతం చేసుకుని దిగ్విజయంగా కొనసాగిన భారత్ జోడో యాత్ర చేపట్టి నేటికీ ఏడాది అవుతున్న చారిత్రక ఘట్టం సంధర్బంగా కోరుట్ల లో పాదయాత్ర చేపట్టడం జరిగింది. భారత్ జోడో యాత్ర లక్ష్యాలను ఉద్దేశ్యాలను ప్రజలకు వివరించడం జరిగింది..దేశ ప్రజలు రాహుల్ గాంధీ గారిని వచ్చే ఎన్నికల్లో భావి ప్రధానిగా బాధ్యతలు అప్పగించేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు.



కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్న, మరియు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మతాన్ని బూచి గా చూపుతూ పబ్బం గడుపుతున్న వాళ్ళను ప్రజలు రాజకీయ శాశ్వత సమాధి చేసేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు.. ఈ పాదయాత్రలో జిల్లా కాంగ్రెస్ సేవా దల్ అధ్యక్షులు అందే మారుతి బాపూజీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లింగం, ఎంఏ నయాం, హఫీజ్, బెజ్జారపు శ్రీనివాస్, బెజ్జారపు రాజు, భూమేష్, కోమిరెడ్డి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్య నారాయణ గౌడ్, అల్లూరి మహేందర్ రెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులైన నజ్జు భాయ్, విఠల్ రవీందర్ రెడ్డి, గంగోని క్రాంతి కుమార్, అల్లూరి సురేందర్ రెడ్డి, ముహమ్మద్ ముజ్బిత్, బర్కం చిట్టి బాబు, గౌరుమంతుల ప్రవీణ్,రీజ్వాన్ పాషా, దండవేని వెంకట్, శశీ, వాసం అజయ్, అమరేందర్, మ్యాకల నర్సయ్య, చిలివేరి విజయ్, ముహమ్మద్ బారి, ఎంబేరి సత్య నారాయణ, అవేజ్, షకీల్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆదర్శనీయుడు సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్ల సంఘాల సన్మానం



**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
నాడు విద్య, వైద్య రంగాల్లో చాలా వెనుకబడి పోయిన జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వచ్చిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆదర్శనీయుడని పేర్కొంటూ జిల్లా సీనియర్ సిటీజేన్స్, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్లు ఘనంగా సన్మానించాయి. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యేకు వివిధ దేవాలయాల్లో పూజలు చేయించిన కిరీటాన్ని ధరింప జేసి, సీనియర్ సిటీజేన్స్ పిలుపు, పెన్షనర్స్ వాయిస్ పుస్తకాలను బహుకరించి అభినందనలు తెలిపారు. జగిత్యాల పట్టణంలో పలువురు సీనియర్ సిటీజేన్స్ ను ప్రమాదాలకు గురి చేసిన యమ డేంజర్ యావర్ రోడ్డు విస్తరణకు, ఆస్తులు కోల్పోయిన యజమానులకు తగు నష్ట పరిహారంతో జీవో జారీ చేయించడం, అధికారులు వెంటనే చర్యలు చేపట్టడం పట్ల తమ అసోసియేషన్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... సీనియర్ సిటీజేన్లకు,పెన్షనర్లకు అన్నివిధాలా అండగా ఉంటానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల సీనియర్ సిటీజేన్స్ సంరక్షణ చట్టంలో పలు ప్రయోజన సవరణలు చేసి మరింత భరోసా కల్పించారని, కేవలం ప్రభుత్వమిస్తున్న పెన్షన్ పై ఆదాయపు పన్ను విధించడం సరికాదని, వారిని కేంద్రప్రభుత్వం ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలన్నారు. పెన్షనర్ల, అన్ని వర్గాల సీనియర్ సిటీజేన్స్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెలుతానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, సీనియర్ సిటీజేన్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్, పెన్షనర్ల జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, సీనియర్ సిటీజేన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, సీనియర్ న్యాయవాది, సీనియర్ సిటీజేన్స్ పట్టణ అధ్యక్షుడు పోతంశెట్టి సతీష్ రాజ్, కార్యదర్శి మానాల కిషన్, జిల్లా, డివిజన్, మండల, పట్టణ సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# మృతుడి కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం



**తరిగొప్పుల సెప్టెంబరు6 (ప్రజామంటలు):**
మండలంలోని అక్కరాజుపల్లి గ్రామం లో బుధవారం రోజున మంచినీళ్ళ కనుకయ్య మరణించాగా. అతని కుటుంబానికి రెయిన్ బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు ఆధ్వర్యంలో వారి ని పరామర్శించి, మృతుడి కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరం అని తీవ్ర దిగ్భ్రా%శీ%తినీ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షుడు భోగం అనూప్, వర్కింగ్ ప్రెసిడెంట్ జొన్నగోని రవీందర్, జొన్నగోని రాజు, తరుణ్ పాల్గొన్నారు.



జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా జరిగిన కథల పోటీలలో పాల్గొని బహుమతి పొందిన జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థ సాచేత్.



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన కోడూరి పరుశురాం గౌడ్ ను నియమించిన జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా జనగామలో గురువారం గోపిక వేష ధారణలో చిన్నారి రంగరాజు తివిష. ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

# "భారత్ జోడో యాత్ర" ఏడాది పూర్తి జనగామలో భారీ ర్యాలీ



**జనగామ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు గురువారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన "భారత్ జోడో యాత్ర" సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా జనగామ పట్టణ, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ జనగామ పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు జనగామ పట్టణ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, మండలం అధ్యక్షులు కొన్నే మహేందర్ రెడ్డి, జనగామ జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికే ఇందిరా కృష్ణ స్వామి, జక్కుల వేణుమాధవ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చింత కింది మల్లేష్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు జఫర్ షరీఫ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఏం.డి మాజీద్, జనగామ సీనియర్ నాయకులు తోట సత్యం, కట్ట కృష్ణ, కాముని శ్రీను, రంగు రవి, రఘు, ఠాకూర్, మండల ఉపాధ్యక్షులు సర్వర్, జనగామ మండలం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు పిట్టల రాజు, సుల్తాన్ గోవింద రెడ్డి, నోముల రాజు, జనగామ మండల యూత్ అధ్యక్షులు నరేష్, సోషల్ మీడియా కో కన్వీనర్ ఫయాజ్, కొండ శ్రీను, కర యాసరపు పర్శరాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో ఆదివాసీ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**జనగామ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
తమిళనాడులో సెప్టెంబర్ 19-21 వరకు జరిగే ఆదివాసీ జాతీయ మహాసభలు జాతీయ మాహాసభల వాల్ పోస్టర్ ను గురువారం జనగామలో తెలంగాణా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తేజావత్ గణేష్ నాయక్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం నుండి 46 మంది ప్రతినిధులు హాజరౌతున్నట్లు గణేష్ నాయక్ తెలిపారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) అనుబంధ తెలంగాణ గిరిజన సంఘం జాతీయ మహాసభలు 2023 సెప్టెంబర్ 19, 20, 21 తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని, దేశ వ్యాప్తంగా 450 మంది ఆదివాసీ ఉద్యమ నాయకులు ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా బృందా కారత్, డా. మిడియం బాబురావు, త్రిపుర మాజీ మంత్రి జతిన్ చౌదరి లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, భూక్య చందు నాయక్, డివైఎఫ్ఐ సోషల్ మీడియా కన్వీనర్ భాషపాక విష్ణు, పట్టణ అధ్యక్షులు వల్లబోదు కళ్యాణ్, నాయకులు, సాయికుమార్, కచ్చిగల వెంకటేష్, అజయ్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులకేనా బీసీ బంద్, మైనార్టీ బంద్ గృహలక్ష్మి పథకాలు : బిజెపి నియోజకవర్గ నాయకులు పొన్నం శ్రీనివాస్





**చిగురుమామిడి సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న పథకాలు అని గొప్పలు చెబుతున్న బిఆర్ఎస్ నాయకులు ఎన్నికల ముందు టిఆర్ఎస్ నాయకులకు పథకాలను అందజేయడం ఏమిటని గురువారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి నియోజకవర్గ నాయకులు పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ.... బీసీ బంద్, మైనార్టీ బంద్, దళిత బంధు ఇలా అనేక పథకాలను బిఆర్ఎస్ కార్యకర్తలకు అందజేయడం జరిగిందన్నారు. నిరుపేదలకు అందేలా గృహలక్ష్మి పథకమైన ఇల్లు లేని నిరుపేదలకు అందజేయాలని బిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఓటుతో బుద్ధి చెబుతామని తెలిపారు అర్హులైన వారికి అందని బీసీ బందు దళిత బంధు మైనార్టీ బందు అందని నిరుపేదలచే రానున్న రోజుల్లో మండలంలోతో పాటు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకుల ఇళ్ల ముట్టడి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపధ్యక్షులు పెండోట రఘుచారి, మండల సీనియర్ నాయకులు గట్టు ఎల్లయ్య, బీజేవైఎం మండల ఉపధ్యక్షులు బొల్లి రమేష్, చిగురుమామిడి బిజెపి బూత్ అధ్యక్షుడు దొంత కరుణాకర్, పెండోట విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# బోయిగూడ సాయిబాబా ఆలయంలో పూజలు



**సనత్ నగర్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా న్యూ బోయిగూడ లోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మాజీ అధ్యక్షుడు మంచాల గోపి ఆద్వర్యంలో జరిగిన పూజలకు ముఖ్య అతిథిగా ఎన్.డీ.ఎమ్.ఏ. మాజీ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదం అందరికీ పంచిపెట్టారు. ఆలయ కోర్ కమిటీ సభ్యులు రాజేందర్, క్రాంతి, సాయికృష్ణ లతోపాటు సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



తరిగొప్పుల మండల కేంద్రములో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అంగన్వాడీ పిల్లల చేత శ్రీకృష్ణుని వేషధారణ గోపికల వేషధారణ వేయించారు.

## రాబోవు ఎన్నికల సందర్భంగా బార్డర్ చెక్ పోస్టులు ఏర్పాటు, మద్యం, నగదు సరఫరా నియంత్రణకై చర్యలు : ఏసిపి సతీష్ వాసాల



**హుస్నాబాద్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
ఇతర జిల్లాల సరిహద్దు పోలీస్ అధికారులతో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏసిపి సతీష్ వాసాల సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి సతీష్ మాట్లాడుతూ హుస్నాబాద్ బార్డర్ పోలీస్ స్టేషన్లో కరీంనగర్, వరంగల్, జిల్లాకు చెందిన అధికారులు ఎప్పటికప్పుడు ఏదైనా సంఘటన జరిగితే సమాచారం అందించాలని సూచించారు. మరియు రాబోవు ఎన్నికల సందర్భంగా బార్డర్ చెక్పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే తెలియపరచి సమస్యలున్న పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, జనగామ జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అదే విధంగా మద్యం, నగదు సరఫరా నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యల పై ప్రత్యేకంగా చర్చించారు. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల పోలీసులు వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి సంబంధిత పోలీసు అధికారులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ లు, సిఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ జన్మాష్టమి, అలరించిన చిన్నారుల వేషధారణలు



**జనగామ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం గీతాశ్రమంలో నిర్వహించిన వేడుకలలో రెండు వందల మంది బాల బాలికలు వివిధ రకాల వేషధారణలు వేసి ప్రేక్షకులను అలరించారు. ఉదయము 8 గం. లకు జెండా ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభం అయ్యాయి. గీతాశ్రమం దేవాలయం, బాలభారతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో కూచిపూడి మైత్రేయ కళాక్షేత్రం గురూజీ సుకేశ్ శిష్యులు అనేక మంది ఈ వేడుకలో పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వేషధారణ, శ్లోకాలు, పద్య పఠనం, చిన్న కథలు, నృత్యం అంశాలలో ప్రదర్శన ఇచ్చారు. లయన్స్ క్లబ్ జనగామ బి బాయిజ్ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు. విద్యార్థులకు జ్ఞాపికలు ఇచ్చి ప్రోత్సహించారు. శోభాయమానంగా జరిగిన ఈ కార్యక్రమంలో గీతాశ్రమం అధ్యక్షులు కొడిపాక ప్రభాకర్, తాళ్లపల్లి నాగరాజు, కోడిపాక బాలరాజు, బాలభారతి నాయకులు త్రిపురారి సూర్యప్రసాద్, పద్మ, శశితేజ, రాజేశ్వర్ భార్గవ అయ్యగారు, కన్న శ్రీనివాస్, డా. డి. శివశంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ధిక్కార స్వరానికి ప్రతీక కాళోజి ( పాట )



పల్లవి:
నా గొడవ నా గొడవ
న్యాయంగా నడవాలని నా గొడవ
అన్యాయాన్ని అరికట్టాలని నా గొడవ
చరణం: అధికారి అయిన అనాధికారి అయిన
అవినీతికి పాల్పడదని నా గొడవ
చిన్న అయినా, పెద్ద అయినా
స్వార్థం విడనాడాలని నా గొడవ
చరణం: దోపిడీలు చేయొద్దని నా గొడవ
దొంగతనాలు మానాలని నా గొడవ
నీతిగా నడవాలని నా గొడవ
నిజాయితీగా మెలగాలని నా గొడవ
చరణం: ప్రజలను హింసించే వాడిపై నా గొడవ
ప్రగతిని చంపే వాడిపై నాగొడవ
చెడు చేసే వాడిపై నా గొడవ
మంచిని అందించాలని నా గొడవ
చరణం సంఘ విద్రోశక్తులపై నా గొడవ
చట్టాన్ని అతిక్రమించే వాడిపై నా గొడవ
సక్రమంగా నడుచుకోవాలని నా గొడవ
పద్ధతిగా మెదలాలని నా గొడవ
రచన: జనగామ శంకర్
తెలంగాణ సాంస్కృతిక సారధి, కవి, గాయకులు, రచయిత
కొత్తపల్లి గ్రామం, మండలం లింగాల గణపురం,
జిల్లా జనగామ – ఫోన్ నెంబర్ 9866 535 732

## ఎమ్మెల్యేల జోక్యం లేకుండా ప్రతి ఒక్కరికీ గొర్రెల పంపిణీ చేయాలి



**జనగామ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
గొర్రెల పంపిణీలో ఎమ్మెల్యేల జోక్యం లేకుండా డిడి కట్టిన ప్రతి ఒక్కరికి గొర్రెల పంపిణీ చేయాలని, రెండో విడత గొర్రెల పంపిణీ మరింత వేగవంతం చేసి, లబ్ధిదారులందరికీ గొర్రెల పంపిణీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని బీరప్ప గుడి కమీటి హాల్ లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు మోటే దేవేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభిస్తారని ఆశతో అప్పు తెచ్చి ఇప్పటివరకు జనగామ జిల్లాలో 2600 మంది లబ్ధిదారులు గొర్రెల కోసం డీడీలు కట్టి 12 నెలలుగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం గొల్ల కురుమలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వానికి సూచించారు.గొర్రెల పెంపకందారులకు నగదు బదిలీ ఇవ్వాలని సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా అధికార పార్టీ మండల అధ్యక్షులు, జడ్పీటీసీ లు, ఎమ్మెల్యే లు గొర్రెల పంపిణిలో భాగస్వామ్యం అవుతూ గ్రామాలలో బారాస పార్టీలో ఉన్న కార్యకర్తలను ఎంపిక చేయడం వారి నుండి డబ్బులు వసూల్ చేయడం గొల్లకురుమలను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదు అని అన్నారు.వెంటనే ప్రజాప్రతినిధులు ఎంపిక చేయడం అనేది ఉపసం హరించుకోని,పార్టీలకు అతీతంగా గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని, చనిపోయిన గొర్రెల కాపరుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్రేషియా ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గొర్రెల,మేకల పెంపకందారుల సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, దాని ద్వారా సొసైటీలు కనుమరుగే అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. తక్షణమే సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు దాటుతున్న మందులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని,తక్షణమే మూగజీవాలకు సరిపడా మందులు అందించాలని అన్నారు. జిల్లాలోని వెటర్నరీ షాప్స్ లో డ్రగ్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ కొరవడిందని, గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11 న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిగారి యాదగిరి, గుండా వెంకటయ్య, బూమాండ్ల కుమారస్వామి, బెల్లి అజయ్, ముక్కర గంగారాజు, వాసర్ల ఐలయ్య, గొరిగే యాదగిరి, కేమీడి వీరమల్లయ్య, పడిదే నర్సయ్య, ఎమ్మె వీరయ్య, నోముల రాములు, కడకంచి గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రభుత్వంలో మైనార్టీలకు న్యాయం తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం పై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
పట్టణానికి విచ్చేసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ ఇంపియాజ్ ఇషాక్ కు పుష్పగుచ్చమ్ అందజేసి స్వాగతం పలికిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మైనార్టీ నాయకులు. అనంతరం మైనార్టీ నాయకులతో కలిసి బి అర్ ఎస్ పార్టీ కార్యాలయం మోతే రోడ్డులో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేషన్ ఛైర్మెన్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రంలో 204 మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందించడం జరుగుతుంది. రాష్ట్రం ఏర్పడక ముందు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు 12. జిల్లాలో 5 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు కాలేజీ ఉండగా 3200 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థి పై 1 లక్ష 20 వేల పైగా నిదులు ప్రభుత్వం కేటాయిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీ లకు విదేశాల విద్య కోసం 20 లక్షల స్కాలర్ షిప్ అందిస్తున్నాము అని అన్నారు. రాష్ట్రంలో కుల, మత తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. మజీద్, షాది ఖానా, ఖబరాస్తాన్ ల అభివృద్ధికి, ఉర్దూ ఘర్ ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం జరిగింది. 4500 డబుల్ బెడ్ రూం ఇండ్లలో మైనార్టీ లలో పేద వారికి అధిక ప్రయోజనం. గతంలో మైనార్టీలని ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే వాడుకున్నారు అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేతల ప్రభుత్వం అని మాటల ప్రభుత్వం కాదని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమైన పండుగలను ప్రభుత్వ పరంగా జరుపుతున్నామని, రంజాన్ సందర్భంగా దుస్తులు, దవత్ ఇస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి ని కోరగానే 500 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరు చేశారని,200 కోట్లతో పనులు ప్రారంభం అయ్యాయని అన్నారు. 2 కోట్లతో సిటీ స్కాన్ ఏర్పాటు ద్వారా పేద ప్రజలకు ఉపయోగం అని అన్నారు. 18 కోట్లతో మంచి నీళ్ళ బావి నుండి చల్ గల్ వరకు బ్లాక్ స్పాట్ రోడ్డు మంజూరు అయినట్లు తెలిపారు. మైనార్టీ లోన్స్ తో మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి అన్నారు. ఇసాక్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందని, మైనార్టీ ల అభ్యున్నతికి కేసిఆర్ నిరంతర కృషి జరుగుతోందన్నారు. రాష్ట్రంలో నిరంతర పక్రియగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 యేండ్లలో మైనార్టీ లకు మొండి చెయ్యి ఎదురైందన్నారు. మత కల్లోలాలు లేని, శాంతి యుత వాతావరణం ఉన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. రెచ్చ గొట్టే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ పార్టీ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు నదీమ్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ మోసిన్, సీనియర్ నాయకులు ఆమీన్, అతెమ్మద్, కౌన్సిలర్ రాజి, కో ఆప్షన్ రియాజ్ మామ, నాయకులు హసిబొద్దిన్, ఫిరోజ్, తాజొద్దిన్, అరిఫ్, ముకీం, ఫరూక్, పిన్ను, నహిధ్, ఖలీద్, బసిత్, అహమ్మద్, రియాజ్ ఖాన్, అమీనుల్ హాసన్, రైజ్వాన్, నుమాన్, సుమైర్, ఫహీమ్, గౌస్, మోయిజ్, అయిబా?న్, జావేద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సింహగర్జనను విజయవంతం చేయండి

### - చిగురుమామిడిలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పోస్టర్ ఆవిష్కరణ

### - ఈనెల 10న హైదరాబాదులో జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరండి : బీసీ సంక్షేమ సంఘం నాయకుల పిలుపు

**చిగురుమామిడి సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు శ్రీరామోజు రాజు కుమార్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయనైనది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు 10న హైదరాబాదులో జరిగే బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి పోతున్నారు. చట్టసభల్లో బీసీలకు దామాషా పద్ధతిలో దక్కాల్సిన వాట దక్కడం లేదని అందుకు బీసీ సబ్బండ కులాలు ఐక్య పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలలో బీసీలకు సీట్లు ఇచ్చేవిధంగా సత్తా చాటాలన్నారు. మండలం నుండి 2000 మందిని తరలి రావాలన్నారు. అనంతరం బిసి సింహగర్జన గోడపత్రికను ఆవిష్కరించారు. గీకురు రవీందర్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించినందుకు పలువురు బీసీ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చుతూ, శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో నాగుల కనకయ్య గౌడ్ జిల్లా అధ్యక్షులు, నారోజు రాకేష్, ఎం.ఎస్ ఆనంద్, బుర్ర శ్రీనివాస్, చెల్పూరి విష్ణుమాచారి, కుల సంఘాల అధ్యక్షులు తాళ్ల పెల్లి తిరుపతి, కంది శంకర్, అల్లేపు సంపత్, నిలుగొండ బిక్షపతి, ఉప సర్పంచ్ తోట సతీష్, మోర ప్రవీణ్, కంది నాగరాజు, చెరుకు సంజీవ్, జక్కుల బాబు, ముంజ



ప్రకాష్, కూన కిట్టు,గట్టు ప్రశాంత్, కొత్తూరు రమేష్, చెప్యాల సంతోష్, బొమ్మగాని వెంకటేష్, ఎ.బి. చారి, బొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్ర ప్లే స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
జిల్లా కేంద్రంలోని రవీంద్ర ప్లే స్కూల్ లో చిన్నారి విద్యార్థిని విద్యార్థులచే ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు చేసిన గోపిక కృష్ణుని వేషధారణలు ఆకట్టుకున్నాయి. వెన్నెముద్దలు తినిపించడం ఉట్టి కొట్టే సన్నివేశాలు చూపరులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఉట్టి కొట్టిన చిన్నారులను పాఠశాల నిర్వహకులు కె. సుమన్ రావు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయు లు, పోషకులు, పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, కిషన్, మౌనిక రావు, రాజు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్



**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
తేదీ: 09-09-2023 న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని జిల్లా ఎస్పి సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.



జిల్లా కేంద్రంలోని ఎస్.ఎస్ ఎస్.ఎం. డిజి హైస్కూల్ లో గురువారం శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నర్సరీ విద్యార్థులను కృష్ణుడు, గోపికల రూపాల్లో ప్రత్యేకంగా వేషధారణలతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సంప్రదాయబద్ధమైన అలంకారం చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ. రాజేందర్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## వల్బాపూర్ లో పురవీధుల గుండా శ్రీకృష్ణుని ఊరేగింపు





**ఎల్కతుర్తి సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పురవీధుల గుండా ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు శ్రీకృష్ణ భగవానుడిని కొలువు తీర్చి పూజలు నిర్వహించినారు, భక్తులు అనేకులు దైవ దర్శనం చేసుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి లోని అష్టమి తిథి యొక్క జన్మ రహస్యం మోక్షం నుండి అనగా పూర్ణత్వం నుండి వచ్చి పుట్టినట్లు గుర్తుగా పౌర్ణమి నుండి చంద్రుడు తగ్గుతూ పోయిన అష్టమి రోజు అనగా కృష్ణ పక్షం 15 రోజుల్లో మధ్యలో నున్న అష్టమి రోజు శ్రీ కృష్ణుడు జన్మ తీసుకోవడం జరిగింది.. శ్రీకృష్ణుడు చెప్పిన జ్ఞానం ను ఆచరించిన వాడు మోక్షం లోనికి పోతాడు భగవద్గీత జ్ఞానం కు వ్యతిరేకం గా జీవించినవాడు అజ్ఞాని గా ఉండి అమావాస్య చీకటి పోతాడు , అంటే జన్మలలోకి వెళతాడు అని అర్థం.. అందుకే దేవుడు అష్టమి నే ఎంచుకుని జగద్గురువుగా పుట్టడం జరిగింది". జ్ఞాన, అజ్ఞానం లకు వారధిగా దేవుడే ఉన్నాడు అని మనం తెలుసుకోవాలి, జాగ్రత్తగా మసలుకోవాలి. 6 వ తేదీ కృష్ణాష్టమి వేడుకలు మొదలై 7వ తేదీ మధ్యాహ్నం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక-ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సభ్యులు సదా నిరంజన్ సిద్ధాంతి, శివనారాయణ్ సింగ్, రాకేష్, శ్రీరామోజు సతీష్ చారి పెండ్యాల బాబు ముదిరాజ్ వెంకట్, సుమన్, ఆదిత్య, క్షేత్ర, రేవతి, కల్పన, కల్యాణి, రాణి, శ్రీలత, సాకేత్ సింగ్, కీరతన్ సింగ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యత ఉద్యమంగా సాగాలి!

అక్షరాస్యత వందకు వందశాతం సాధిస్తే ఏ దేశమైనా అభివృద్ధిలో దూసుకుని పోతుంది. అక్షరాస్యతతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుంది. ఆరోగ్యపరంగా కూడా సమాజం బాగుపడుతుంది. ఏటా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం జరుపుకుంటున్నా...లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. అక్షరాస్యతను వ్యక్తులు, సంఘాలకు అందించటం లక్ష్యంగా పాలకులు ముందుకు సాగాల్సి ఉంది. అక్ష్యరాస్యతా ముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే, ఇది పిల్లల విద్యపైనేగాకుండా, వయోజన విద్య మీద కూడా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. 1965లో యునెస్కో ప్రతిపాదనతో సెప్టెంబర్ 8, 1966న మొట్టమొదటి సారిగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం జరుపుకున్నారు. 2003-12 దశకంను యునైటెడ్ నేషన్స్ అక్షరాస్యత దశకంగా యునెస్కో ప్రకటించింది. ఆ దశకం అంతా లిటరసీ ఇనిషియేటివ్ ఫర్ ఎంపవర్‌మెంట్ పక్రియ ద్వారా అక్షరాస్యుల సంఖ్యను పెంచటానికి కృషి చేసింది. ఢాకాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, యునెస్కో డైరెక్టర్ జెనరల్ ఇరిన బొకోవా కలసి 2014 యునెస్కో అంతర్జాతీయ అక్షరాస్యత బహుమతిని అందించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినం వేడుకలు వివిధ దేశాలలో ప్రత్యేక నేపథ్యాలుగా అందరికీ విద్య అనే లక్ష్యాలను చేరవేసే కృషి చేస్తున్నాయి. ఇతర యునైటెడ్ నేషన్స్ కార్యక్రమాలు యునైటెడ్ నేషన్స్ అక్షరాస్యత డికేడ్ నిర్వహిస్తున్నవి. మనదేశమే తీసుకుంటే ప్రభుత్వాలు విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తున్నాయి. వయోజనన విద్యావ్యాప్తకి గతంలో జరిగిన ప్రచారం కూడా జరగడం లేదు. నేటికీ ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు తీర్చడం లేదు. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం గతంలో చేసిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో కెజి టూ పిజి అన్న ప్రతిపాదన కోల్డ్ స్టోరేజీకి వెళ్లింది. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అన్న చర్చ సాగింది. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అన్న మౌలిక ప్రశ్నలు వచ్చాయి. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? రీతిలో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. అయితే ఇంగ్లీష్ మీడియం ప్రకటించడానికి ముందు ఆ మేరకు స్కూళ్లను సిద్దం చేసి టీచర్లను నియమించాల్సి ఉంది. ప్రకటనలు బాగున్నా ఆచరణలో పక్కా ప్రణాళిక ఉండాలి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడ తాయని అందరి అభిప్రాయం. నిపుణులు కూడా మాతృభాషా బోధనే మేలంటున్నారు. ఇంగ్లీష్ నేర్పడం వేరు.బోధన వేరని ఆయన అభిప్రాయంగా ఉంది. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో ఆసక్తి ఉండాల్సిందే. కానీ బోధన మాతృభాషలో కొనసాగాలి. ప్రతి ఒక్కరికి విద్య అన్నది నిర్బంధం కావాలి. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా..దేశంలో జాతీయోద్యమంగా సాగాలి. ప్రపంచంలోనే అనేక దేశాలు, అందులో అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాషలోనే ప్రాథమిక విద్యను బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటు న్నాయి. రష్యా,జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమం లోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాషలోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. భారతీయుడి ఆలోచన బ్రిటీష్ వాడిదిగా ఉండాలనే లక్ష్యంతో మెకాలే విద్యా విధానం ప్రవేశ పెట్టారు. మనగురుకుల విద్యను దెబ్బతీయాలన్న సంకల్పంతో ఆ పనిచేశాడు. తన ఆలోచనలతో ప్రభావితం చేసి భారతీయులను శాశ్వతంగా బానిస మనస్తత్వంతో బతికేలా కుట్ర చేశారు. ప్రజలంతా ఒక్కటై తనపై తిరగబడకుండా 3 లేక 4 భాషల ప్రజలను ఒక ప్రావిన్స్‌లో ఇరికించారు. ఈ కుట్రను భగం చేసి అందరినీ ఒక్కటి చేసేందుకే మాతృభాషా ఉద్యమాలకు జాతీయో ద్యమం పిలుపునిచ్చింది. అందువల్ల ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదం కావాలి.అది దేశంలో జాతీయోద్యమంగా సాగాలి.



## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

## ప్రావీణ్యం...

ఒక గ్రామంలో వరదయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి చాలా పొలం ఉంది. ఆవులు, గేదెలు మేకలు, కోళ్లు కూడా ఉన్నాయి. పదిమంది జీతగాళ్లు ఉన్నారు. వారికి తన ఇంటి వద్దనే గదులు ఇచ్చాడు. పనులు సరిగా చేస్తేనే మంచి ఫలితం లభిస్తుందని వాళ్ళ నాన్న తాత చెప్పింది నమ్మేవాడు. చిన్న నాటి నుండే వాయిదాలు అన్న మాట లేకుండా సరైన వేలకు సరైన పనులు చేస్తూ చేయించేవాడు.

జీతగాల్లలో రాజయ్య సోమయ్య లు వట్టి బద్ధకస్తులు. పనులు తప్పించుకోవాలని బాగా తిని పండుకోవాలని చూసేవారు.

వరదయ్య ప్రతిరోజు కోడిపుంజు కూయగానే నిద్ర లేచేవాడు. అందరిని లేపేవాడు. పొలం పనులకు బాయి వద్దకు, కొట్టాల వద్దకు జీతగాల్లను తీసుకొని పోయేవాడు.

ఒకరోజు రాజయ్య "ఒరే సోమయ్యా ఈ వరదయ్య పటేల్ పండనీయకుండా చీకటితోనే లేపుతున్నాడు. అది కోడి కూస్తేనే కదా. ఆ కోడి లేకుండా చేద్దామా" అన్నాడు.


ఓ అలాగే అని కోడిని పట్టుకొని కోసుకొని తిన్నారు. కోడిపుంజు ఏమైంది అని అడిగితే రాత్రి అది ఇంటికి రాలేదు. ఎటు పోయిందో ఏమో అన్నారు కూలీలు.

రాత్రి అందరూ తిని పండుకున్నారు. పని పైన ధ్యాసతో వరదయ్య రోజు కంటే ముందుగానే లేచినాడు. లేవండి అంటూ తనకు తెలివి కాగానే అందరిని లేపినాడు.పనులకు తీసుకపోయినాడు.

ఈ వరదయ్య పనులు చేయించక తప్పదు అని అనుకున్నారు. ప్రతిరోజు అలాగే కోడి లేకపోవడంతో వరదయ్య రెండు గంటల నుంచి ఎప్పుడు తెలివైతే, మేలుకువ అయితే అప్పుడే అందరిని లేపేవాడు. దేనితో రాజయ్య సోమయ్య ఈ వరదయ్య గారు మనల్ని వదలడురా.

ఇంకో కోడి పుంజును తెస్తేనే మనకు మంచిదిని అనుకున్నారు.

అంగడికి పోయి అలాంటి ఒక కోడినే కొనుక్కొని, ఎరుకలేనట్లుగా



వచ్చి ఇంటి దగ్గర వదిలారు. మన కోడిపుంజు ఎటో పోయింది. కానీ ఈ పుంజు వచ్చింది అని వరదయ్యకు చూపారు.

తిరిగి యధావిధిగా కోడి కూయగానే అందరూ లేసేవారు, పనులకు పోయేవారు. అలా సోమయ్య రాజయ్య లు కూడా పనులను చేస్తూ మంచివారుగా తయారు అయినారు. వరదయ్య వారిని మార్చాడు. ఇది అంతా కోడిపుంజు కూయడం పనిపై ధ్యాస అని తెలుసుకున్నారు.

**పెందోట వెంకటేశ్వర్లు సిద్దిపేట. - 9440524546.**

## తల్లి ప్రేమ

శ్రీశైలం అడవులలో ఒక పెద్ద పులి నివసించేది. సంతాన భాగ్యం మాత్రం కలగలేదు. ఎప్పుడు దిగులుగా కనబడేది. ఆ పెద్ద పులి దిగులుకు కారణం అడవిలోని జంతువులకు తెలుసు. పెద్దపులి మిగిలిన జంతువుల పిల్లలకు అక్కున చేర్చుకొని ఆహారం కూడా ఇచ్చేది. ఒకరోజు పెద్ద పులి దిగులుగా ఉండడం చూసి ఎలుగుబంటి" నీవు దిగులుగా ఉండకు. నీకు కూడా సంతాన భాగ్యం కలుగుతుంది. నీవంటి మంచి వాళ్లకు మంచే జరుగుతుంది"అని అంది.

అలా కాలం గడుస్తుండగా పెద్దపులి గర్భం దాల్చిన ది. పెద్దపులి ఆనందానికి అవధులు లేవు. అడవిలో ఉన్న జంతువులు కూడా పెద్దపులికి సంతానం కలగ బోతుంది అని తెలిసి సంతోషపడ్డాయి. పెద్దపులి ఒకే కాన్పులో నాలుగు ఆడ పులి పిల్లలకు జన్మనిచ్చింది. పిల్లలను చూసి మురిసిపోయింది. నాలుగు పులి పిల్లలకు సరిపోయే విధంగా పాలను ఇవ్వాలి. కానీ పెద్దపులి నాలుగు పులి పిల్లల ఆకలి తీర్చలేకపోయింది.

తాను మరింత ఆహారం తీసుకుంటేనే , తన పిల్లలకు సరిపోయేంత పాలు ఇవ్వగలనని అనుకుంది. అయితే నిరంతరము తన చుట్టూ తనతో స్నేహంగా ఉన్నజంతువులు ను, వాటి పిల్లలను వేటాడడానికి పెద్దపులికి మనసు రాలేదు. కానీ తన పిల్లలకు సరిపోయేంత పాలును అందివ్వాలంటే తనకు ఆహారం చాలా అవసరం. అందుకే పిల్లలను అక్కడే వదిలిపెట్టి ఆహారం కోసం వేటాడడానికి అడవి చివారులకు వెళ్ళింది. పెద్దపులి దురదృష్టం కొలది ఆహారం సరిపోయినంత లభించలేదు. ఇంకా వేట కోసం పెద్దపులి అడవి చుట్టూ తిరుగుతున్నది. అడవిలో పులి పిల్లలు తల్లి కనబడకపోవడంతో తల్లడిల్లిపోయాయి. తమ తల్లిని వెతుక్కుంటూ దారి తప్పి, అడవి చివారు గ్రామంలోకి వచ్చేసాయి. వాటికి ఎటు వెళ్ళాలో తెలియలేదు. అక్కడే ఉండిపోయా యి. ఉదయం సరికి అటువైపు వెళ్లే గ్రామస్తులు చూసి పులి పిల్లలు తమ గ్రామంలోకి వచ్చేసాయి అని భయపడి అటవీ అధికారులకు తెలియజేశారు. వారు హుటా హుటిన వచ్చి నాలుగు పులి పిల్లలను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. వాటికి పాలు పెట్టినా అవి తల్లి పై బెంగతో తాగటం లేదు. బిత్తర చూపులు చూస్తున్నాయి.

అడవిలో వేట పూర్తి చేసుకున్న పెద్దపులి తన పిల్లల కోసం తన నివాసానికి వెళ్ళింది. అక్కడ పులి పిల్లలు కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికింది. కనబడిన ప్రతి జంతువుని అడిగింది. తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. తన పిల్లల ఆచూకీ కోసం తిరుగుతూనే ఉంది.

ఇక్కడ నాలుగు పులి పిల్లలు కూడా తల్లి కోసం తల్లడిల్లుతున్నాయి. అటవీ అధికారులు పులి పిల్లలను తల్లి దగ్గరకు చేర్చాలని తమ వంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. వారి ప్రయత్నం విజయవంతమై ఆ తల్లిని ఆ పులి పిల్లలు చేరుకుంటే అంతకుమించిన ఆనందం ఇంకేముంది. తల్లి బిడ్డలు ఒకే దగ్గర ఉండాలి. అడవి తల్లి వాళ్ళను ఒక దగ్గరికి చేర్చాలని మనం కోరుకుందాం

**మొర్రి గోపి - కవిటి, 8897882202**

## ఆధిపత్య దోరణే ప్రతిపక్షాల ప్రధాన శత్రువు



సిహెచ్ వి ప్రభాకర్ రావు,
సీనియర్ జర్నలిస్ట్. 93915 33339

**(నిన్నటి సంచిక తరువాయి)**

ఇవన్నీ మరిచిపోయి, ప్రతిపక్షాల అతి ఉత్సాహంగా ఉన్న ప్రతిపక్ష కూటమి ఇండియా, తనలోని వారిపట్ల పూర్తి అవగాహనతో, నిరంతర జాగురుకతతో లేకపోతే, వారి బలాలే వారికి ప్రతికూలమై, రాబోయే ఎన్నికల్లో వాటి విజయవకాశలపై ప్రతికూల ప్రభావ చూపే అవకాశం కూడా ఉంది. నిజంగా బిజేపి జమిలి ఎన్నికలకు పోకుండా, 22 ఐదు రాష్ట్రాల ఎన్నికలే జరిపితే, రాజస్తాన్, మధ్యప్రదేశ్ ఛత్తీస్ ఘడ్ లలో విజయ ఆవకాశాలు ఉన్నాయనుకొంటున్న కాంగ్రెస్ కు ఆపార్టీలోని నాయకుల మధ్య ఉన్న అనైక్యతే వారి ఓటమికి కారణం కావచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మధ్యప్రదేశ్ లోని బహు నాయకత్వం, రాజస్తాన్ లోని అసమ్మతి కాంగ్రెస్ కు చిక్కులు తెస్తున్నాయి. తెలంగాణలో విజయవకశాలు మిణుకుమిణుకు మంతున్నా, కాంగ్రెస్ లోని కోవర్ట్ లతో, సీనియర్ల అనైక్యత,ఒకరిపై ఒకరికి ఉన్న అపనమ్మకంతో, కాంగ్రెస్ అనేక స్థానాలలో బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టి పరోక్షంగా భారాస గెలుపుకు దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక తెలంగాణలో బిజేపి పూర్తిగా భారాస తో అవగాహనతో ఉందని, ఎన్ని దంబహాలు పొలికినా, 10 స్థానాలలో గెలవగల అభ్యర్థులను నిలుపగలిగినా గొప్పే అని భావిస్తున్నారు.

**డిసెంబర్ సెమీ ఫైనల్ లిట్మస్ పరీక్ష**

ఈ సెమీ ఫైనల్ బిజేపి విజయావకాశాలను పూర్తిగా దెబ్బతీసి,, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ లలో తప్పని సరిగా కాంగ్రెస్ గెలిచి తీరాలి. కానీ ఇంకా ఆయా రాష్ట్రాలలో అభ్యర్థుల ఎంపిక విషయంలో తొలి దశను కూడా కానరేక్ దాటలేకపోతుంది. కాంగ్రెస్



మాత్రమే ఇండియా కూటమిలో, దేశం మూతయామ్ మీద ఎంతో కొంత మేర బిజేపి ని అడ్డుకోగల బలమైన పార్టీ. కూటమి లోని మిగతా ఏపార్టీ కూడా 20-25 స్థానాలు గెలువగల పార్టీ ఏది లేదు. పరిస్థితులు అనుకూలిస్తే, పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ 25 స్థానాలకు అటు ఇటుగా గెలిచినా, మరే పార్టీ కూడా అదరిదాపుల్లోకి రావడం సాధ్యం కాదు. లవక సభలో 40 స్థానాలకు మించిన రాష్ట్రాలు బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర మాత్రమే. బీహార్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్టలలో కాంగ్రెస్ పాత్ర నామ మాత్రమే. మధ్య ప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, ఛత్తీస్ ఘడ్ కర్ణాటక, అస్సాం లలోని 133 సీట్లలో కనీసం 60-75 సీట్లను గెలుచుకో గలిగితేనే కూటమికి అధికారం చేజిక్కించుకొనే అవకాశాలు కనబడతాయి. దక్షిణాన తమిళనాడు, కేరళ లో గణనీయమైన స్థానాలు, ఒకటి రెండు స్థానాలు తెలంగాణలో గెలిచే అవకాశాలు ఉన్నాయి. జాతీయ పార్టీగా కాంగ్రెస్ 150 నుండి 200ల స్థానాలను గెలుచుకోలేక పోతే ఇండియా కూటమి మళ్ళీ ప్రతిపాక్ష స్థానంలో కూర్చోక తప్పదు.

ఇక చివరిగా చెప్పుకోవాల్సింది ఉభయ కమ్యూనిస్టుపారీలు. వారికి కేరళ మినహా ఎక్కడా బలం లేదు. వారు గెలవకున్నా, ఇతరులను ఓడించగలరాని తెలుసు. అలా ఓడించకుండా, మిత్రులను గెలిపిస్తే, వారు గెలిచినట్లే. వారికి కావాల్సిన రాజ్య సభ సీట్లు వారిలోని ప్రధాన నాయకులకు లభిస్తాయి. అలా కాకుండా తెలంగాణలో లా వ్యవహరిస్తే మాత్రం అందరూ శంకరమాన్యాలుపట్టుక వెళ్ళాల్సిందే.

## అన్నీ అమ్మేశాక ఇంకెక్కడి కోటా..!

స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటిష్ వాళ్ళు కనీసం వ్యాపార దృక్పథం కోసమే అయినా వాళ్ళు నిర్మించిన ఓడ, రైలు, చివరకు విమాన సంస్థలు కూడా నేడు దేశంలో అమ్ముడు పోయాయి. రైతులు సాగు చేసుకునే వ్యవసాయ రంగం కూడా అమ్ముడు పోయి మొత్తం దేశ ప్రజలు నిరాదరణకు, పేదరికానికి దగ్గరైన తరుణంలో అసలు ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలన్నీ ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేసి రిజర్వేషన్స్ లేని దేశంలో, రాష్ట్రంలో ఎస్సిలను వర్గీకరిస్తామని నమ్మించడం ముమ్మాటికీ మోసమే అవుతుంది. స్వాతంత్ర్యం తరువాత 1952 నుండి 1996 వరకు తొలి భారత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కొన్ని వేల ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలు తర్వాత వచ్చిన నేతలు వారి వారి వ్యాపారాలు రాజకీయ అవసరాల నిమిత్తం కొంచెం కొంచెంగా నేడు నూటికి 97 శతం అమ్మేసి కేవలం రిజర్వేషన్స్ లేని న్యాయ సంస్థలు, రక్షణ, ఆర్మీ నూటికి 99 శాతం అగ్రకుల వ్యక్తులు అనుభవిస్తున్న వ్యవస్థలు దేశంలో మిగిలి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బిజెపి కిషన్ రెడ్డి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి లాంటి వ్యాపార వేత్తలు రిజర్వేషన్స్ పంచాలని మాట్లాడటం రాజకీయ కుట్రలో భాగమే అవుతుంది. భారత రాజ్యాంగం అమల్లోకి రాక ముందు దేశంలో చదువు పిడికెడు మందికే ఉండేదనే విషయం కనీసం జ్ఞానం ఉన్న ప్రతి వ్యక్తికీ తెలుసు. 1950 జనవరి 26న దేశ ప్రజలందరికీ కుల మాట వర్గ లింగ భేదం లేకుండా ప్రాథమిక విద్య అమల్లోకి వచ్చింది. అప్పటికి దేశంలోని ఎస్సి, ఎస్టి, ప్రజలు బిసి ప్రజలు స్త్రీలు చదువలేదు వారికీ ప్రాథమిక విద్యపూర్తి చేసే సరికే 20 యేండ్లు పట్టింది. బాబాసాహెబ్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్‌లు అప్పుడు వాళ్లకు ఉపయోగపడ్డాయి. తర్వాత 1980 నాటికీ కొద్దిగా చదువుకున్న కొంత మంది ఉన్నత విద్యకు వృత్తి విద్యలకు దగ్గరయ్యారు. అయినా సరే ఎస్సి, ఎస్టి, బిసిలు అత్యున్నత ఉద్యోగాలు, పదవులు పొందలేరు. కారణం ఆయా రంగాల్లో రిజర్వేషన్ లేక పోవడమే.

1980 నుండి 1990 వరకు దేశంలోని విశ్వవిద్యాలయాల్లో కూడా అప్పుడప్పుడే ఈ కులాల విద్యార్థులు అడుగు పెడుతున్నారు. అది చూసి కళ్ళు మండి హైందవ మతం పేరుతో రాజ్యానికి తిరిగి వచ్చిన పాలకులు ఏకంగా రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు తొలగించాలని తీవ్రంగా ప్రయత్నం చేశారు. చివరికి భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ దాన్ని వ్యతిరేకించి దేశ ప్రజాలకు రాజ్యాంగం, అందులోని రిజర్వేషన్స్ నేటికీ కేవలం 5 శాతం మాత్రమే అమలు అవుతున్నాయని రాజ్యాంగాన్ని మార్చితే దేశం నాశనం అవుతున్నదని చాలా స్పష్టంగా రాజకీయ పార్టీలకు, నాయకులకు తెలియ జేశారు. ప్రయివేటీకరణ ప్రపంచీకరణ దేశంలోకి వచ్చినప్పటినుండి ప్రత్యక్షంగా రిజర్వేషన్స్ తొలగించబడ్డాయి. వాటి గురించి మాట్లాడకుండా ఏ మాత్రం సామాజిక అవగాహనా లేకుండా సచ్చిన శవాన్ని బతికిస్తామని ప్రగల్భాలు పలకడం సిగ్గు చేటు.

భారత దేశంలో అమలైన హైందవ సిద్ధాంతం, మానవ సంబంధాలను కట్టడి చేస్తూ ఇనుప కంచెలు వేసి ఎప్పటికీ కలవకూడని ఆంక్షలను విధించింది. ఈ ఆంక్షలు ఎవరైనా అతిక్రమిస్తే దేవుడు చాలా పెద్ద శిక్ష వేస్తాడు కనుక ఒక పని చేసి బతికే మనిషి ఇంకో పని చేసి బతికే మనిషిని కనీసం ముట్టుకునే వీలు లేకుండా దేశాన్ని 6 వేయిల కులాలుగా విభజన చేసి భూమిపైన ఎక్కడ కూడా లేని కులాల కుంపటిని మనువు రగిల్చినాడు. అలాంటి అమానవీయ మానవ సమాజాన్ని బాబా సాహెబ్ డా. బిఆర్ అంబేద్కర్ సమీకరించి ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్య, వైద్య, రాజకీయ, మానసిక అంశాలను లెక్కలోకి తీసుకుని మనువు చేసిన మానవ విభజనను తొలగించి కొన్ని కులాలకు అంటరానితనం ఆధారంగా కొన్ని రాయితీలు కల్పించారు. వాటి పేరు scheduled casts, scheduled tribes. రిజర్వేషన్లు ఆయా ప్రజలకు కేవలం ఇతర కులాల ప్రజలతో కొన్ని అంశాల్లో సమానం కావడానికి, ఆత్మగౌరవంగా జీవించడానికి మాత్రమే ఉపయోగపడతాయని వాళ్ళను కొన్ని ప్రత్యేక షెడ్యూల్‌లో ఉంచి వాళ్ళను బాబా సాహెబ్ షెడ్యూల్డ్, కులాలు షెడ్యూల్డ్ తెగలు అని రాజ్యాంగంలో పొందుపరిచారు. ఈ ప్రజల హక్కులు కేంద్రం ప్రత్యేకంగా కాపాడాలని ఈ హక్కులకు భంగం కలిగితే స్వయంగా భారత రాష్ట్రపతి (Presi dent of India) చొరవ తీసుకుంటాడని చాలా స్పష్టంగా రాజ్యాంగంలో పొందుపరిచి వాటి రక్షణ కోసం ఒక కమిషన్ కూడా ఏర్పాటు చేసుకోవాలని అయన చెప్పారు. నేడు రిజర్వేషన్స్ దేశంలోని అన్ని కులాలకు అందుతున్నాయి.

ప్రజా మంటలు
రచయితలకు మనవి

సామాజిక, రాజకీయ అంశాలపై విశ్లేషణాత్మక రచనలు ఆహ్వానిస్తున్నాం. జయంతి, వర్ధంతి ల రచనలకు పంపకండి. సామాజిక దృక్పథంతో, శాస్త్రీయ, తార్కిక దృష్టితో రాసిన రచనలకు ప్రాధాన్యత. మీ రచనలను వర్డ్ యూనీకోడ్, పేజ్ మేకర్ అను 7.0 ఫైల్‌లలో 350 నుండి 400 లపదాలకు మించకుండా ఈమైల్ :
prajamantalu@gmail.com కు పంపండి.
ఎడిటర్.

# పండుగకు ముస్తాబవుతున్న గణనాథులు

**- ఉప్పల్ ఆర్.టీ.వో. పక్కన పెద్ద సంఖ్యలో విగ్రహాల కారానాలు ఎన్నికల సీజన్ తో పెరగనున్న మండపాలు**

**ఎందరికో ఉపాధినిస్తున్న గణపతి విగ్రహాల తయారీ పరిశ్రమ**



సికింద్రాబాద్ సెప్టెంబర్ 07 ( ప్రజామంటలు):
వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో సిటీలో గణనాథుడి విగ్రహాల తయారీ ఊపందుకుంది. అసెంబ్లీ ఎన్నికలు కూడ దగ్గరగా ఉండటంతో ఈ ఏడాది వినాయక మండపాలు పెద్ద సంఖ్యలో పెరిగే అవకాశం ఉంది. ఓటర్ దేవుళ్ళను ప్రసన్నం చేసుకోవడానికి ఈ సారి నాయకులు గణేశుడి సాయం తీసుకొని బరిలో దిగడానికి అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించారు. బస్తీలు, గల్లీలు, వాడల్లో ఏర్పాటు చేసే గణేశ్ మండప ఖర్చులు తామే భరించడానికి సిద్దం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే మండపాల నిర్వాహకులు తమ, తమ గణేషుడి విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి రిజర్వు చేసుకోగా, మరికొందరు తీసుకెళ్ళి భద్రపరుస్తున్నారు. ఒక్క సిటీలోనే లక్షల సంఖ్యలో విగ్రహాల తయారీ:గ్రేటర్ హైదరాబాద్ లో దాదాపు 3 లక్షల పెద్ద విగ్రహాలు , ఇండ్లల్లో పెట్టే చిన్న విగ్రహాలు ఒక కోటి 50 లక్షల వరకు తయారు చేస్తున్నారు. సిటీలోని ప్రసిద్ద గాంచిన దూల్పేట తో పాటు ఉప్పల్, నాగోల్, పెద్ద అంబర్ పేట, మియాపూర్ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల తయారీ కారా?నాలు దాదాపు 500 వరకు ఉన్నాయి. వినాయక విగ్రహాల తయారీ, విక్రయాలతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, లక్షల్లో పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కరోనా పాండమిక్ లో రెండు సంవత్సరాలు దారుణంగా దెబ్బతిన్న విగ్రహాల తయారీ పరిశ్రమ గత ఏడాది నుంచి పుంజుకుంది. పెద్ద విగ్రహాలను స్థానికంగా తయారు చేస్తుండగా, చిన్న విగ్రహాలను షోలాపూర్ లో బల్క్ గా తయారు చేయించి, ఇక్కడికి తీసుకొచ్చి, హెూల్ సేల్ గా విక్రయిస్తున్నారు. ఇక్కడ తయారు అయ్యే విగ్రహాలు రాష్ట్రంలోని పలు జిల్లాలకు సప్లై అవుతుండగా, ఇతర రాష్ట్రాల వాళ్ళు కూడ ఆర్డర్ చేసి కొనుగోళ్ళు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. కాగా ప్రత్యేక డిజైన్లతో తయారు చేసే విగ్రహాలను విదేశాలకు కూడ ఎగుమతి చేస్తున్నారు. సిటిలో ఖాళీ స్థలాలను లీజు తీసుకొని తాత్కలిక షెడ్లు వేసుకోని విగ్రహాల తయారీతో పాటు నిల్వ చేయడానికి వాడుతుండగా, మరికొందరు ఫంక్షన్ హాల్స్ ను బుక్ చేసుకొని వినియోగిస్తున్నారు. వినాయక చవితి పండుగ ముగిసిన తర్వాత 3నెలల పాటు విరామం ఇచ్చి, తిరిగి జనవరి నెలలో విగ్రహాల తయారీ పనులను ప్రారంభిస్తామని నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద జయచంద్ర పంక్షన్ హాల్ లో గణేశ్ ప్రతిమలు తయారు చేస్తున్న జీవనె బస్వరాజు తెలిపారు. వ ం ట్ట్ గణపతి విగ్రహాల తయారీ లో ఇబ్బందులు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. తయారీకి సమయం ఎక్కువగా పట్టడంతో పాటు డ్యామేజీ కి అవకాశం ఎక్కువగా ఉందని, ఎక్కువ కాలం నిల్వ ఉంచలేమని చెబుతున్నారు. ప్లాస్టర్ ప్యారిస్ తో అయితే మోల్డ్ (డై), కర్రలను ఉపయోగించి, సులభంగా విగ్రహాలు తయారుచేయవచ్చని, అదే మట్టి అయితే చేతులతో నొక్కుతూ చేయాల్సి ఉంటుందని, చేతులు నొప్పి పెడుతుండటం కారణంగా మట్టి విగ్రహాల తయారీకి కార్మికులు ఇష్టపడటం లేదంటున్నారు. మట్టి వినాయకుల ధరలు కూడ ఎక్కువగా ఉంటున్నాయి. ఎనిమిది ఫీట్ల ప్లాస్టర్ ప్యారిస్ గణేశుడి విగ్రహం ధర రూ 20వేలు ఉంటే, మట్టి విగ్రహం ధర రూ 30 వేల వరకు ఉంటుంది. ముడి సరుకు ధరలు పెరిగాయి: ఓ వైపు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లాంటి ముడి సరుకు ధరల పెరుగుదలతో పాటు కూలీల రేట్లు, పెరగడంతో విగ్రహాల ధరలు పెంచక తప్పలేదని తయారీ దారుల చెబుతున్నారు. గత ఏడాది ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ 25 కిలోల బ్యాగ్ రూ 125 ఉంటే ఇప్పుడు అది ఏకంగా డబుల్ అయి రూ 250 కి చేరుకుందని ఉప్పల్ కారా?న నిర్వాహకుడు బస్వరాజ్ తెలిపారు. ప్రతి సంవత్సరం జరుపుకునే వినాయక నవరాత్రోత్సవాల వేడుకలతో లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. విగ్రహాల తయారీ చేసే కార్మికులు, కారా?న నిర్వాహకులు, పెయింటర్స్, ఆటో, ట్రాలీ డ్రైవర్లు, లోడింగ్, అన్లోడింగ్ లేబర్లు, పేయింట్ అమ్మే దుకాణ దారులు, మండపాలను అలంకరణ చేసే ఎలక్ట్రీషియన్లు, డెకరేషన్ సిబ్బంది...ఇలా చాలా మంది సీజనల్ ఉపాధి పొందుతున్నారు. విగ్రహాల తయారీ, స్ప్రే పెయింటింగ్ చేసే కార్మికులు రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి వస్తుండగా, స్థానికుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. విగ్రహాల తయారీతో చాలా మందికి ఉపాధి.. నాగోల్ మెట్రో దగ్గర, విగ్రహాల కారా?న నిర్వాహకులు, జీవనె బస్వరాజు, గతంలో పోల్చితే ఈ ఏడాది ఎన్నికల కారణంగా విగ్రహాల బిజినెస్ పెరిగే అవకాశముంది. ముడి సరుకు, తదితర ధరలు పెరగడంతో కొంత ఇబ్బందిగా ఉంది. విగ్రహాల తయారీ వలన ఏ ఒక్కరికో కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది. చదువుకునే విద్యార్థుల కూడ తమ పేరెంట్స్ సాయంతో మా దగ్గర విగ్రహాలను తీసుకెళ్ళి అమ్ముతూ లబ్ది పొందుతున్నారు. నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉప్పల్ ఆర్.టీ.వో. పక్కనున్న ఫిల్లర్ నెం. 845 దగ్గర జయచంద్ర పంక్షన్ హాల్ లో ప్రత్యేకంగా ఒక్క ఫీట్ సైజ్ నుంచి 9 ఫీట్ల వరకు విగ్రహాలను తయారు చేసి అమ్ముతున్నామన్నారు.

## ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికే రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, బిజెపి వాట్సాప్ యూనివర్సిటీ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని అసమర్ధుడని చూపించే ప్రయత్నం చేసిందని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పూర్తి చేసి సంవత్సర కాలం గడిచిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి పొన్నం ప్రభాకర్ పాదయాత్ర నిర్వహించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని బిజెపి వాట్సాప్ స్కూల్ ద్వారా విమర్శల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసిందని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఇద్దరు గుజరాతిలైన మోడీ, అమిత్ షాలు మరో ఇద్దరు గుజరాతీలైన ఆదాని, అంబానికి దేశాన్ని అమ్మేస్తుంటే, దేశాన్ని కాపాడుకోవడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రను నిర్వహించారన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రజలు మార్పు తీసుకువచ్చారని, ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీ పాదయాత్రకు సార్ధకతను చేకూర్చాలన్నారు. మేక్ ఇన్ ఇండియా అన్న ప్రధాని మోడీ ఇప్పుడు ఇండియా కూటమికి భయపడి ఇండియా పేరునే మార్చి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. అటు కేంద్రంలో ప్రధాని మోడీ, ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ లు అప్రజాస్వామికంగా, ప్రజల గొంతుకను అణిచివేస్తూ నియంతృత్వ పరిపాలన చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, భీమదేవరపల్లి మండల అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి : టిపిటిఎఫ్ డిమాండ్



**జనగామ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన స్కేలు అమలు చేయాలని టిపిటిఎఫ్ జనగామ జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత నాలుగు రోజులుగా జనగామ బస్టాండ్ చౌరస్తాలో సూర్యాపేట రోడ్డు నందు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ.... విద్యాశాఖ సమగ్ర శిక్షలో వివిధ హెూదాల్లో 22,000 పైగా కాంట్రాక్టు ఉద్యోగులు గత 15 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారు అని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీని వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా కనీసం సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వారితో వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మయ్య మాట్లాడుతూ.... విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తూ రాష్ట్ర విద్యాభివృద్ధికి పాటుపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గత నాలుగు రోజులుగా రిలే నిరాహార ర దీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వారి న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఉద్యమం కొనసాగించవలనని వారికి టిపిటిఎఫ్ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ రాజు, జిల్లా బాధ్యులు వజ్రయ్య, అంకుశావళి, శ్రీరామ్, వెంకన్న, ప్రభాకర్, రాజేందర్, మండల బాధ్యులు రాజారెడ్డి, రాజయ్య, లక్ష్మణ్.జి, గణేష్, వరప్రసాద్, నరసింహ నాయక్, సత్యవర్ధన్ రెడ్డి, సత్తిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# భారత్ మాతాకీ జై అనటం వలన కొన్ని పార్టీలకు ఎందుకు నచ్చడం లేదు

**- శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ**

**హైదరాబాద్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
గురువారం శివసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ దేశానికి భారత్ అనే పేరు మార్పు పై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టికల్ 1 ద్వారా దేశాన్ని ఇండియా, భారత్ అని రెండు పేర్లతో పిలిచే హక్కు ఉంది. ఆర్టికల్ 1 సవరణ ఈ దేశంను కేవలం భారత్ గా మాత్రమే పిలవాలని డిమాండ్ చేసారు. బ్రిటిష్ వారు పెట్టిన పేరు ఇంకా ఈ దేశానికీ ఎందుకు ఉండాలని ఇండియా కుటమిని, మరియు వ్యతిరేక వర్గం పైన ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ దేశంలో అత్యున్నతమైన అవార్డ్ పేరు భారత రత్న అలాంటప్పుడు ఈ దేశం కేవలం భారత్ గా ఉంటే తప్పేముందీ. సనాతన ధర్మం పైన పిచ్చిగా మాట్లాడితే బహిరంగంగా దాడులు చేసేందుకు కూడా సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. సనాతన ధర్మం నిర్మూలించడం ఎవరి తరం కాలేదనే చరిత్ర తెలియని అజానులు ఇంకా ఈ దేశంలో ఉండటం సిగ్గు చేటని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో నేను భయంకరమైన హిందు అని మాట్లాడిన సంగతి గుర్తుందా ఉంటే హైదరాబాద్ పేరును భాగ్యనగర్ గా, నిజామాబాద్ పేరును ఇందూర్ గా, మహబూబ్ నగర్ పేరును పాలమూరు గా, సికింద్రాబాద్ పేరును ఉజ్జయినీ మహంకాళీ గా మార్చాలని డిమాండ్ చేసారు.



నిజాం నవాబులు పెట్టిన పేర్లు గుర్తించి వెంటనే అవి మార్చే విధంగా ప్రభుత్వం సిద్ధమవ్వాలని డిమాండ్ చేసారు. శివసేన పార్టీని రాకోతీర్చే విధంగా పాలన ఉండాలని అన్నారు. సనాతన ధర్మం పైన కావాలని ఉదయనిదీ స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చెయ్యడం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతనం నిర్మూలించడం సృష్టిలో జరగని విషయమనీ అన్నారు. దేశాన్ని తల్లిగా భావించి భారత్ మాతాకీ జై అంటాం దీంట్లో రాజకీయం ఎక్కడ ఉంది. కొంత మంది ఇండియా కూటమి సభ్యులకు పిచ్చి పట్టింది. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైదరాబాద్లో పార్లమెంటు కన్వినర్ సుర్యవంశి రమేష్ మరియు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ రూపంలో కృష్ణుని రూపంతో ఒప్పంద ఉద్యోగుల దీక్షలు



**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల దీక్షలు జిల్లా కేంద్రంలో యధావిధిగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని దీక్ష శిబిరం ముందు రోడు పైన శ్రీకృష్ణ రూపంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రాన్ని వేసి వినూత్న పద్దతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎన్నో రోజులుగా వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కనీసం తమ సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనసు మార్చి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టడానికి శ్రీకృష్ణ పరమాత్మను వేడుకున్నట్లు తెలిపారు.


## కుల సంఘాల అభివృద్ధికి చేయూతనిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

**-ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, కల్వకుంట్ల సంజయ్**



**కోరుట్ల రూరల్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
కోరుట్ల మండలం లోని మాధాపూర్ మరియు మోహన్ రావు పేట గ్రామాల్లోవివిధ కుల సంఘాల అభివృద్ధి కి దాదాపు ఇరవై ఐదు లక్షల అరవై వేల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ లు అందజేశారు. ఇందులో మాధాపూర్ గ్రామానికి చెందిన శాలివాహన, అంబేద్కర్, మాల వడ్డెర, మాదిగ సంఘ భవనాల అభివృద్ధి కి రెండు లక్షల చొప్పున అందజేశారు. అనంతరం మోహన్ రావు పేట గ్రామంలో ముదిరాజ్, గంగ పుత్ర, మాదిగ మహిళా కమ్యూనిటీ హాల్ మరియు పద్మ శాలి, ఒడ్డెర, యాదవ గౌడ, సంఘాల భవనాల అభివృద్ధి కొరకు రెండు లక్షల చొప్పున అదే విధంగా గౌడ కమ్యూనిటీ హాల్ బోరు కొరకు లక్ష అరవై వేల రూపాయాల ప్రొసీడింగ్ పత్రాలు సంఘ భాద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుల సంఘాల వారితో మమేకమై కెసిఆర్ హయాంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాలలో నే కాకుండా గ్రామాలలో కూడా కుల సంఘాలు, కుల వృత్తులు అభివృద్ధి చెందాలనే ఆశయంతో ఇన్ని లక్షల నిధులు విడుదల చేస్తున్నారని కుల సంఘాల అభివృద్ధే మా ప్రభుత్వ ద్యేయమని తెలిపారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి కెసిఆర్ సహకారంతో మన ఎమ్మెల్యే హయాంలో కోరుట్ల నియోజకవర్గం దినదినాభివృద్ధి జరుగుతుందని ఇలాంటి అభివృద్ధి మనం ఎప్పుడు కూడా చూడలేదని అన్నారు. ఇందుకు కారణమైన ముఖ్య మంత్రి కెసిఆర్ కు మనము కృతజ్ఞతలు తెలుపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జగిత్యాల జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు చీటీ వెంకట్రావు, కోరుట్ల ఎంపీపీ తోట నారాయణ, కోరుట్ల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, మరియు సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు, ప్రెస్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



**మహాదేవపూర్ సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జరుగగా పలువురు చిన్నారులు కృష్ణుడు గోపికల వేషధారణలతో సందడి చేశారు. స్థానిక రామాలయం నుండి కొబ్బరికాయ కొట్టి ఎస్సై రాజకుమార్ శోభాయాత్రను ప్రారంభించగా మహాదేవపూర్ పురవీధుల్లో డీజే పాటలతో భజనలు చేస్తూ తిరిగారు. ఈ వేడుకల్లో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బెంబిరి దేవరావు, జిల్లా సహా కార్యదర్శి అంకిరెడ్డి, భజరంగ్ దళ్ ప్రఖండ ప్రముఖ్, చీలం మధుకర్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పోత మనోజ్, చెక్కల రాకేష్ ఠాకూర్, అరవింద్ సింగ్, శీలం పవన్ చిన్నారులు పాల్గొన్నారు.

## వివాహిత స్త్రీ అదృశ్యం

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 07 (ప్రజామంటలు):**
ముల్కనూర్ పోలీస్ స్టేషన్లో గురువారం వివాహిత స్త్రీ మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. వారు అందించిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట 30 ని.లకు కొత్తపల్లి గ్రామానికి చెందిన రాగుల రవళి (20) ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్ళిపోయింది. ఆమె ఇంట్లో నుండి వెళ్ళిపోవడానికి భార్యాభర్తల గొడవలే కారణమని తెలిపారు. భర్త రాగుల శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలతో సాతారం గ్రామ శివారులో వాగు ప్రవాహం ఉధృతికి ఒడ్డు కోతకు గురై పక్కన ఉన్న హెచ్డి టవర్ కూలిపోయే ప్రమాదం ఉండడంతో విద్యుత్ అధికారులు వెళ్లి రెండు రోజుల వ్యవధిలో టవర్ పనులు పూర్తి చేసి తిరిగి మెట్ పల్లి డివిజన్ ప్రాంతానికి విద్యుత్తు పునరుద్ధరించారు.

# ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదా!



విశాఖ బ్యూరో : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.150 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఆధునీకరణ పనుల పేరుతో వేలాడే జెట్టీలను నిర్మించి ప్రమాదాలుగనక చోటుచేసుకుంటే ఆ వంకతో అక్కడ నుంచి శాశ్వతంగా మత్స్యకారులను తరలించే ఆలోచన దీని వెనుక ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతుండగా ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణానికి డిపిఆర్ సిద్ధమైంది. దీనిపై మత్స్యకారుల అభిప్రాయాలు తీసుకోకుండానే కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ముందుకు వెళ్లాలని చూస్తున్నాయి. దీనివల్ల తమకు ఉపయోగం ఉండదని మత్స్యకారులు చెప్తున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 11జెట్టీలు ఉన్నాయి. ఇవి మత్స్యకారులకు ఎంతోగానే ఉపయోగపడుతున్నాయి. పెరిగిన అవసరాల దృష్ట్యా ఇవి చాలడం లేదు. దీంతో, కొత్త జెట్టీల నిర్మాణం తెరపైకి వచ్చింది. అప్పట్లో రూ.40 కోట్లతో డిపిఆర్ తయారైంది.గత టిడిపి ప్రభుత్వం రూ.23 కోట్లకు పాలనా ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒత్తిడి చేయకపోవడంతో ఆచరణ రూపం దాల్చలేదు. కేంద్రంలో అధికారంలోన్న బిజెపి ప్రభుత్వం జెట్టీల విషయంలో తన విధానాన్ని మార్చుకుంది. ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణంపై వైపు మొగ్గు చూపుతోంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక 2019లో వీటిపై మళ్లీ చర్చ మొదలైంది. అప్పటి కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి గిరిధర్ సింగ్ విశాఖ హార్బర్‌కు విచ్చేసి రూ.100 కోట్లతో ప్రణాళికలు తయారు చేసి వెళ్లిపోయారు. కానీ, ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఈలోగా 2022లో ఈ డిపిఆర్ రూ.150 కోట్లకు ఎగబాకింది. విశాఖ ఫిషింగ్ హార్బర్ పక్కనే ప్రయివేట్ విసిటిపిఎల్ విస్తరణ బెర్తు ఏర్పాటు కావడంతో ప్రయివేట్ వ్యాపారుల లాభార్జనే ధ్యేయంగా ఫింగర్ జెట్టీకి కాకుండా ఫ్లోటింగ్ జెట్టీ దిశగా పాలకులు అడుగులు వేస్తున్నారు. 20 ఏళ్లుగా ఒక్క వెసెల్‌ను కూడా తీయడానికి కృషి చేయలేదు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700 వరకూ మెకనైజ్డ్ (ఆధునిక బోట్లు), మరో మూడు వేల వరకూ చిన్నచిన్న బోట్లూ ఉన్నాయి. మొత్తంగా 15 వేల మంది మత్స్యకా రులు ఈ హార్బర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు, కోల్డ్ స్టోరేజీ, శానిటేషన్ అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారు. 200 బోట్ల కోసం మాత్రమే గతంలో 11 జెట్టీలను నిర్మించారు. ఓ వైపు బోట్లు సంఖ్య పెరుగుతున్నా జెట్టీల సంఖ్య పెరగలేదు. మరోవైపు ఉన్న జెట్టీల్లో కొన్నింటిపై కోస్ట్‌గార్డ్‌ల పెత్తనం ఉండడంతో మత్స్యకారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో బోట్ల నిలుపుదలకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలాభావం పెద్ద సమస్యగా మారింది. మత్స్యసంపదను సముద్రం నుంచి వేగంగా తెచ్చుకుని అమ్ముకోవడం, రవాణాకు అనువుగా ఉండేలా ఆధునీకరణ జరగాలని, కొత్తగా ఫింగర్ జట్టీలు నిర్మించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. ఫ్లోటింగ్ జెట్టీలతో సమస్యలు తలెత్తనున్నాయని, దీనిపైకి 30 మంది మత్స్యకారులు వెళితే జెట్టీ మునిగిపోవడం ఖాయమని మత్స్యకార సంఘం నాయకులు చంద్రశేఖర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఫింగర్ జట్టీపైకి వందమంది వెళ్లినా ఏమీకాదని పేర్కొన్నారు. బోట్ల యజమానులతో సమావేశం నిర్వహించి ఫ్లోటింగ్ హార్బర్ జెట్టీపై అభిప్రాయం తీసుకోలేదని ఆయన అంటున్నారు.

# సిరులు కురిపిస్తున్న కెపి ఉల్లి



చాపాడు ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. కెపి (కృష్ణా పురం) ఉల్లి ధరలు మరింత ఘాటుగా ఉండటంతో సాగు చేసిన రైతులకు ఈ ఏడాది సిరు లు కురిపిస్తున్నాయి. రెండేళ్ల కంటే అధిక ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది కెపి ఉల్లికి మార్కెట్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ ఏడాది పంట పోలాలోకి వ్యాపారులు వరుస కడుతున్నారు. నూర్పిడి చేసిన వెంటనే కొనుగోలు చేసి తరలిస్తున్నారు.కెపి ఉల్లి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది రూ.పది సంపాదించుకునే అవకాశం ఏర్పడింది. కొన్నేళ్లుగా పండించిన పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వచ్చేది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు .విత్తనాలు కిలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వంతున వినియోగించారు. ప్రస్తుతం నూర్పిడి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత నెలలో వర్షాలు పడటంతో ఉల్లిగడ్డలు కుళ్లి ఇబ్బందికరంగా మారి దిగుబడి మాత్రం తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. క్వింటా రూ.9500 నుంచి రూ.10 వేలు పలుకుతుండటంతో దళారులు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. రాయలసీమకు విదేశీ మారక ద్రవ్యం తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి విదేశీ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం గతంలో నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడేవారు. ఈ ఏడాది రైతులకు సమస్య తొలగిపోయినది. స్థానికంగా అమ్మకం చేయాలంటే ధళారులు నిర్ణయించినదే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బి.మఠం మండలాలతో పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచినది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబారు, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై గతంలో నిషేధం విధించింది. ప్రస్తుతం నిషేధం ఎత్తివేయడంతో ధరలు బాగా ఉన్నాయి. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది. అందుకే ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి కెపి ఉల్లి ఎగుమతులపై నిషేధం తొలగించినది. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది 4వేల ఎకరాలలో ఉల్లి పంట సాగైంది. దాదాపుగా 15 వేల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు ఉల్లి పంటను ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేయడం ఆనవాయితీ. ప్రారంభంలో క్వింటా కెపి ఉల్లి ధర రూ.8 వేలతో ప్రారంభమై ప్రస్తుతం రూ.10 వేల వరకు పెరిగాయి. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# అక్రమంగా కర్నాటకకు కంకర తరలింపు



బొమ్మనహాల్ :అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రానికి కంకర తరలుతోంది. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్ గ్రామంలోని కంకర మిషన్ల నుండి రోజూ వచ్చే కంకర బోట్, రాజి పౌడర్‌ను యాజమాన్యం కర్ణాటకకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైన్స్, జియాలజీ శాఖల నుండి అనుమతిపొందిన వారే టన్నుల ప్రకారం కంకర బోట్, రాజి పౌడర్ కర్ణాటకలో అమ్మాల్సి ఉంటుంది. కాసులకు కక్కుర్తిపడి అక్రమంగా కంకర కర్ణాటకకు తరలుతున్నా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ప్రయివేటు కంకర మిషన్ల యాజమన్యాంతో కుమ్మక్కై తూతూ మంత్రంగా ట్రిప్ సీట్లు మంజూరుచేసి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండిపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కంకర మిషన్ యజమానులు సైతం బళ్లారిలో నివాసం ఉంటున్నందున వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. అధికారులు కంకర తోలేందుకు స్థానికంగా ఉన్న టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులకు అనుమతులు ఇవ్వకుండా కర్నాటకలోని బళ్లారిలో ఉండే వ్యాపారులకు టిప్ సీట్లు అందజేస్తున్నట్లు సమాచారం. బొమ్మనహాల్ మండలంలో కంకర ఫ్యాక్టరీలు బోలెడు ఉన్నా స్థానికంగా భవన నిర్మాణాలకు కంకర అందుబాటులో ఉండడంలేదు. ప్రతిరోజు సుమారు 20 టిప్పర్ల పైబడి కంకర కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు నెమకల్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆంధ్రాలో కంకర మిషన్లు ఉన్నా లాభాలు మాత్రం కర్ణాటక వారికే దక్కుతున్నాయని వాపోతున్నారు. పునాదులకు అవసరమైన బోట్ రాస్ తమకు దొరకడం లేదు.. కర్ణాటకలోని వారికి మాత్రం కేవలం గంట సమయంలోనే అందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అనుమతులు లేని కార్ణాటక టిప్పర్లు ఆంధ్రాలో ప్రవేశించి కంకర లోడు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. క్వారీల్లో 20 అడుగుల లోతు మాత్రమే బ్లాస్టింగ్ చేయాలి. సుమారు 50 అడుగులకు పైబడి బ్లాస్టింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అక్రమ కంకర రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# అభ్యంతరాలుంటే తెలపండి : కలెక్టర్



చిత్తూరు:ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ విడుదల చేయడం జరిగిందని, అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్ల జాబితాలను విడుదల చేయడం జరిగిందని అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆధార్ లింకేజీ మార్చి 31వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణ అన్నారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్రోల్మెంట్ అధికారిగా వ్యవహరిస్తున్న డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఎస్ఆర్ 2023 మేరకు ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15లక్షల 43వేల 730 మంది ఉన్నారని, ఇందులో పురుషులు 7,65, 833 కాగా, మహిళలు 7,77,784 మంది ట్రాన్స్ జెండర్‌లు 113 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి 1000 మంది పురుషులకు 1016 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా మహిళలు ఎక్కువగా నగిరిలో ఉన్నారని తక్కువగా కుప్పం నియోజకవర్గంలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫైనల్ జాబితా విడుదల చేయడం జరిగిందని, చిత్తూరు జిల్లాలో 54,237 మంది గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోగా, టీచర్ల స్థానానికి సంబంధించి 3,545 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మొత్తం ఎమ్మెల్సీ స్థానానికి గాను ప్రస్తుత ఆరు జిల్లాల పరిధిలో 383061 మంది, టీచర్ల స్థానానికి 26, 888 మంది ఓటర్లుగా నమోదు అయి ఉన్నారని ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఇవ్వవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో వారీగా ఇప్పటికే జాబితాలు ఇవ్వడం జరిగిందని ప్రతి 14మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఇటీవల మార్పులు చేర్పుల్లో కొంత సంఖ్య పెరగడంతో ఈ ప్రతిపాదనలను తిరిగి పంపడం చేశామని తెలిపారు. ఆధార్ అప్డేషన్‌కు సంబంధించి మార్చి31 వరకు సమయం ఉందని ఈ కార్యక్రమం వేగవంతంగా చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ విధంగా అందరూ కషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే నామినేషన్ల రోజు వరకు స్వీకరించడం జరుగుతుందని, టీచర్ల ఓటు నమోదు కార్యక్రమంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చునని ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, ప్రతి ఆర్డీవో కమిటీ మెంబర్లుగా ఉంటారన్నారు. జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డిసి పర్వీన్, ఆర్డీవోలు శివయ్య, సజన ఇతర తహశీల్దార్లతో పాటు రాజకీయ పార్టీల నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగారాజు, బహుజన సమాజ్ పార్టీ నుంచి నాగరాజు, బిజెపి నుంచి రామభద్ర, సిపిఐ నుంచి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి పరదేశి, టిడిపి నుంచి సురేంద్ర కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి మురుగేష్ లు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## అఖిల భారత కిసాన్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య డిమాండ్



ఒంగోలు : ప్రధాని నరేంద్ర మోడీ రైతు సంఘాల నేతలకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిల భారత కిసాన్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. ఈనెల 26న ఒంగోలులో నిర్వహిస్తున్న ట్రాక్టర్ల నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా రైతు సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ ఉత్తర భారతదేశం హర్యానాలోని జుండ్ కేంద్రంగా ఈనెల 26న లక్ష ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ రైతు సంఘాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతులు ట్రాక్టర్ ర్యాలీలను నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ కేంద్రంగా 5,405 రైతు సంఘాలు ఆధ్వర్యంలో ఏడాది పాటు నడిచిన ఉద్యమం చారిత్రాత్మకమన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రపంచం గుర్తించిందని, ఐక్యరాజ్యసమితి తమ మద్దతును ఇచ్చిందన్నారు. చివరకు సుప్రీంకోర్టు కూడా కొన్ని రోజులపాటు రైతాంగ ఉద్యమాన్ని ఆపివేయాలంటూ పదేపదే కోరిందన్నారు. చివరకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత జాతికి క్షమాపణలు చెబుతూ మూడు చట్టాలను రద్దు రద్దు చేశారన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాతపూర్వకంగా ప్రధాని మోడీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 26న ట్రాక్టర్ల నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, పట్టణాలలోని అల్పాదాయ వర్గాలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను భాగమైన స్వామినాథన్ సిఫార్సులకు చట్టబద్ధం చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. మాండూస్ తుఫాన్ తో ప్రకాశం జిల్లాలో 11,000 ఎకరాలలో పొగాకు పంట దెబ్బతిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వంతోపాటు, పొగాకు బోర్డు గుర్తించిందన్నారు. బోర్డు వద్ద రైతులకు సంబంధించిన రూ.635 కోట్లు నగదు ఉందని, విపత్తు సమయంలో కేంద్రం వెంటనే స్పందించి బోర్డు ద్వారా పొగాకు రైతులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ. 1200 కోట్లు వెంటనే మంజూరు చేసి సెప్టెంబర్ నాటికి వెలుగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మాబు మాట్లాడుతూ చారిత్రాత్మక ఉద్యమాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలివిగా విరమింపచేశామని అనుకుంటుందని, రైతాంగ ఉద్యమం తాత్కాలిక విరమణ మాత్రమేనని తెలిపారు.

# ప్రజలకు మంచి చేసే లక్ష్యంతో కలిసి పనిచేయండి

## - ఎమ్మెల్యే నంబూరు



అమరావతి:ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు కలిసి పని చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. మండల కేంద్రమైన అమరావతి లోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ కళ్యాణ మండపంలో గృహసారథుల నియామకంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర రావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న లక్ష్యంతో ముఖ్య మంత్రి వైఎస్ ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమిస్తున్నారన్నారు. ఇప్ప టికే నియోజకవర్గంలో 72 సచివాలయాలకు కన్వీనర్ల నియామకం పూర్తైందన్నారు. అమ రావతి మండల పరిధిలోని మల్లాది గ్రామానికి చెందిన భవిరిశెట్టి హనుమంతరావును మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమించడం జరిగిందన్నారు.

# ఈసురోమంటున్న ఇళ్ల నిర్మాణం



గుంటూరు జిల్లాప్రతినిధి : జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణం మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు పలు కారణాలతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకోలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69,912 ఇళ్లను తొలిదశలో మంజూరు చేయగా ఇప్పటి వరకు మ్యాపింగ్ చేసిన వాటిల్లో 63,361 ఇళ్లను చేపట్టారు. వీటిల్లో కేవలం 8,705 ఇళ్లు మాత్రమే పురోగతిలో ఉన్నాయి. వీటిని ఉగాది నాటికి పూర్తి చేయించాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచించింది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80 వేలు, మరో 35 వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి మొత్తం రూ.2.15 లక్షలతో ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. మొదటి, రెండు కేటగిరిల్లో లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా చేపట్టినవి 41 వేల వరకు ఉన్నాయి. ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా మరో 22 వేలు ఇళ్లు ఉన్నాయి. గుంటూరు నగర వాసులకు దాదాపు 62 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా 20 వేల ఇళ్లు తొలిదశలో నిర్మించాలని నిర్ణయించారు. పేరేచర్ల, ఏటుకూరు, లాం, కొర్నేపాడు, బుడంపాడు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. కొర్నేపాడులో ఒక కాలనీలో ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా చేపట్టలేదు. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేవు. రెండో కాలనీలో వందల సంఖ్యలో చేపట్టారు.గుంటూరు నగర వాసులకు ఇళ్లు కేటాయించిన పేరేచర్ల జగనన్న కాలనీలో18 వేల ఇళ్లు మంజూరు చేయగా 10 వేల ఇళ్లు కాంట్రాక్టరు ద్వారానే నిర్మించాలని తలపెట్టారు. కానీ ఇంత వరకు పట్టుమని 10 ఇళ్లుకూడా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయించలేకపోయారు. మెప్మా, డిఆర్‌డిఎ ద్వారా జిల్లా మొత్తం మీద 25 వేల మందికి రూ.35 చొప్పున రుణాలు ఇప్పించినట్టు అధికారులు చెబుతున్నారు. అయినా ఇళ్లు పూర్తి అయ్యే పరిస్థితి లేదు. ఒక్కొ ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు కేటాయించి ఇసుక ఉచితంగా, సిమెంటు, ఇనుము ఇతర మెటీరియల్ తక్కువ ధరకు సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ 48 నుంచి 72 అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు కనీసం నాలుగు నుంచి ఐదు లక్షలు ఉంటేనే పూర్తవుతాయని లబ్ధిదారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో నిర్మాణం కష్టమని తెలిసినా అధికారులు లబ్ధిదారులపై వివిధ రూపాల్లో వత్తిడి తెస్తున్నారు.

# ఈ రోడ్లు వేసేదెన్నడో..!



వీరవాసరం:నిధులున్నా పనులు ప్రారంభించని స్థితిలో వీరవాసరం-పెనుమంట్ర ఆర్‌అండ్‌బి రహదారి అధ్వానంగా ఉంది. నాలుగేళ్లుగా ఈ మార్గంలో అనేక అవస్థలు పడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు ఈ రహదారి నిర్మాణంపై దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఈ మార్గంలో వీరవాసరం రైల్వే గేటు నుండి సుమారు మూడు కిలోమీటర్ల వరకు పటిష్టపర్చడానికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) నుండి సుమారు ఐదున్నర కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టడానికి కాంట్రాక్టు సైతం ఖరారైంది. ప్రస్తుతమున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా సర్వే పూర్తి చేసి కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులు మాత్రం ఇంకా మొదలు కాలేదు. రోడ్డు విస్తరణ, అభివృద్ధికి నిధులు మంజూరవ్వడంతో అధికారులు కనీసం గోతులు కూడా పూడ్చకుండా వదిలేశారు. అదే సమయంలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో జనాలకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి ఈ రహదారి విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు స్పందించకపోవడం గమనార్హం. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు వర్షాకాలంలో పెద్దపెద్ద గోతులతో నిండి ఉంటుంది. ఈ గోతుల్లో పడి అనేక మంది గాయాల పాలైన పరిస్థితీ ఉంది. ఈ ప్రాంతంలో అడపాదడపా మరమ్మతులు చేస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ యథాస్థితికి చేరడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు.

# జీజీహెచ్‌లో కరవైన భద్రత

మంచిర్యాల : భద్రతా వైఫల్యం జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి)లో కొనసాగుతోంది. గతంలో పలుమార్లు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి పసికందులను మరుగుదొడ్డిలో వదిలిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం, అన్ని చోట్ల అందుబాటులో లేకపోవడంతో గుర్తించడం కష్టంగా మారిన విషయం తెలిసిందే. ఇటీవల రెండు ఏసీలకు సంబంధించిన భాగాలు చోరీకి గురవడంతో పర్యవేక్షకులు ఫిర్యాదు చేశారు. సిబ్బంది దృష్టిలో ఉన్న వస్తువుల వివరాలు మాత్రమే తెలుస్తున్నాయి. తెలియని, పట్టించుకోని సామగ్రి ఏ మేరకు దొంగలపాలవుతుందో ప్రశ్నార్థకంగా మారింది. అయినా జీజీహెచ్ నిర్వాహకులు భద్రతపై దృష్టి సారించడం లేదు.ప్రస్తుత జీజీహెచ్‌లో దాదాపు 60 కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, వైద్యారోగ్యశాఖకు సంబంధించిన పలు విభాగాల నుంచి మంజూరైనట్లు ఇక్కడి సిబ్బంది చెబుతున్నారు. వీటి పర్యవేక్షణ ఆరోగ్యశ్రీ గదితో పాటు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉన్నట్లు తెలుస్తోంది. వేర్వేరు సమయాల్లో రావడం, ఇప్పటికే ఉన్నచోట అమర్చడం, పాతవి పనిచేస్తున్నాయో లేదో పరీక్షించకపోవడంతో ఏ ప్రాంతంలో ఎన్ని వినియోగంలో ఉన్నాయో అవగాహన లేకుండా పోయింది. ఇదే ఆసుపత్రి గతంలో ఏరియా, ఆ తర్వాత జిల్లా, ప్రస్తుతం జీజీహెచ్‌గా మారడంతో పర్యవేక్షకుల్లో గందరగోళం నెలకొంది. వీటిపై ఇప్పుడిప్పుడే దృష్టిసారిస్తున్నట్లు, సీసీ కెమెరాల పనితీరు మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నట్లు ప్రస్తుత అధికారులు వివరణ ఇస్తున్నారు. ఇది జీజీహెచ్‌లోని సాధారణ ప్రసవాలు నిర్వహించే గది వెనుకభాగం. ఇటీవల దీనికి సంబంధించిన ఏసీ విడి భాగాన్ని ఇలా తీగను తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో పాటు



మరొకటి కూడా చోరీకి గురైంది. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రహరీ ఎత్తు చాలా తక్కువగా ఉండటం, సీసీ కెమెరాలు ఒక్కటి కూడా ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ఇక్కడ కనిపిస్తున్న సీసీ కెమెరా కనెక్షన్ లేకుండా ఇలా అలంకారప్రాయంగా అమర్చి ఉంచారు. సీబీనాట్ గదికి వద్ద ఉన్న ఈ కెమెరా వినియోగంలో ఉంటే రెండో ద్వారం నుంచి రాకపోకలు సాగించే దృశ్యాలు కనిపించే అవకాశముంటుంది. ఇది.. శవాలు భద్రపరిచే గదికి వెళ్లేదారి. ఈ పక్కన రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రానికి కేటాయించిన గదుల వెనుక భాగం ఉంటుంది. ఇక్కడ ఏసీలకు సంబంధించిన సామగ్రి ఇలా బయటే కనిపిస్తాయి. ఈ ప్రాంతంలోనూ ఒక్క సీసీ కెమెరా అమర్చలేదు. రాత్రి వేళల్లో ఇటువైపు ఎవరు వచ్చినా తెలియదు.. ఏ వస్తువు దొంగలించినా దొరికే పరిస్థితి ఉండదు.

# అక్రమ నిర్మాణాలపై ఆన్‌లైన్ ఫిర్యాదు అస్త్రం



పాల్వంచ :ఇకపై అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరిగినా.. చెరువు శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ఇందుకోసం పురపాలక శాఖ ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ప్లాట్లు, అక్రమ వెంచర్లు, లేఔట్లపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలుకల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయాలు అమలు చేసేందుకు మూడు దశల్లో బృందాలు ఏర్పాటు చేశారు. మొదటి దశ(ఎల్–1)లో తహసీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ అధికారితో కూడిన (ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం ఉంటుంది. ఎల్–2లో పట్టణ ప్రణాళిక అధికారి (కమిషనర్ సహా), ఎల్–3లో సబ్ కలెక్టర్, కలెక్టరుతో కూడిన కమిటీ ఉంటాయి. కమిషనర్ దశలో తీసుకున్న నిర్ణయాన్ని ఉన్నత స్థాయి అధికారుల అనుమతితో అమలు చేస్తారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం పోర్టల్‌ను పర్యవేక్షిస్తోంది. ఉభయ జిల్లాల్లో అనుమతి లేని నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో పోర్టల్ పద్ధతిని బల్దియాలు సద్వినియోగం చేసుకోవాలి. అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇచ్చేలా పురవాసులను ప్రోత్సహించటంతోపాటు వారికి తగిన భరోసా ఇవ్వాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పురపాలకాల్లో అనుమతుల్లేని నిర్మాణాలు కోకొల్లలు. భద్రాద్రిలోని నాలుగు పురపాలకాల్లో ఇటీవల జోరుగా సాగుతున్నాయి. టీఎస్–బీపాస్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకునే వీలుంది. అయినా కొందరు పట్టించుకోవడం లేదు. నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తూ ఆదాయానికి గండికొడుతున్నారు. శివారు కాలనీల్లో ఈ పరిస్థితి అధికం. అనుమతి లేనికట్టడాలను కూల్చివేసేందుకు బీపాస్‌లో భాగంగా నాలుగు శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశారు. వారు సొంత పనులకే సమయం చాలడం లేదంటున్నారు. చాలామంది అనుమతి తీసుకుని ఆపై నిర్మాణాలు చేపట్టడంలో నిబంధనలు విస్మరిస్తున్నారు. వీరి విషయంలో కచ్చిత పరిశీలన, తగిన సమయం అవసరం. అసలు అనుమతి లేకుండా నిర్మిస్తే మాత్రం నోటీసు లేకుండానే కూల్చివేయవచ్చు. పట్టణ పరిధిలో ఏదైనా అక్రమ నిర్మాణం, ఆక్రమణ జరిగితే పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారు పూర్తిపేరు, ఈ–మెయిల్ ఐడీ, నిర్మాణం, లేదా ఆక్రమణ జరిగిన ప్రాంతం పేరు, ఫొటోలు జతచేయాలి. 'ఎల్–1' బృందం ఈ ఫిర్యాదును పరిశీలిస్తుంది. చర్యలు తీసుకోదగినదైతే టీపీవోల(ఎల్–2) పరిశీలనకు పంపుతారు. టీపీవోలు వివరాలు పరిశీలించి కమిషనర్‌కు పంపుతారు. నిర్మాణం అక్రమమా? సక్రమమా? ఒకవేళ అక్రమం అయితే జరిమానా విధించాలా? కూల్చివేయాలా అనే నిర్ణయాన్ని తీసుకుంటారు. తిరిగి పరిశీలన, తుది చర్యలు తీసుకోవాలని ఎల్–1కు సిఫార్సు చేస్తారు. త్వరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్ పురపాలకాల్లో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎల్–1, ఎల్–2లోని టీపీవోలు, ఇతర సిబ్బందికి శిక్షణ ముగిసింది. త్వరలో ఉన్నతస్థాయి అధికారులకు ఈ కార్యక్రమం చేపడతారు. పురపాలకాల ఆదాయాలకు గండికొడుతున్న అక్రమార్కులపై వేగంగా చర్యలు చేపట్టేందుకు ఈ విధానం తోడ్పడుతుంది. ఇందులో ప్రజల బాధ్యతపైనా అవగాహన కల్పిస్తాం.

# ఇంటింటా చెత్త సేకరణ అంతంతే



సిద్దిపేట :జిల్లాలోని బల్దియాల్లో చాలాచోట్ల ఇంటింటా చెత్త సేకరణ మందకొడిగా సాగుతోంది. దీంతో కొందరు తడి, పొడి చెత్తను రోడ్ల పక్కన పారేస్తుండడంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. గాలులకు పాలిథీన్ సంచులు, కాగితాలు ఇళ్లలోకి వచ్చిపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇంటింటా చెత్తసేకరణ నూరు శాతం చేపట్టి పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం తరుచూ చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణలో పెట్టడం లేదు. నామ్‌కే వాస్తేగా కొన్ని వార్డుల్లో చెత్తసేకరణ చేపట్టి చేదులు దులుపుకొంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని బల్దియాల్లో పరిశీలించగా సిద్దిపేట మినహా మిగతా వాటిలో పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దుబ్బాక పురపాలికలో రోజూ ఏర్పడుతున్న చెత్తతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. పురపాలికలో 20 వార్డులు, 35 వేల జనాభా ఉంది. రోజూ పట్టణంలో 8– 10 టన్నుల చెత్తను 6 ఆటోలు 2 ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తున్నారు. పురపాలికలో డీఆర్‌సీసీ కేంద్రం ఏర్పాటు పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవడంతో తాత్కాలికంగా పట్టణ శివారులో, మరికొన్ని చోట్ల పాడుబడిన బావుల వద్ద వేస్తున్నారు. ఉన్న 8 వాహనాలు పురపాలికలో చెత్త సేకరణకు సరిపోవడం లేదు. 3, 4 రోజులకోసారి వచ్చే చెత్త సేకరణ వాహనాలతో కొంత మంది ప్రజలు ఇంట్లోని చెత్తను అక్కడక్కడా బయట వేస్తున్నారు. చేర్యాల బల్దియాలో 12 వార్డులున్నాయి. ఇక్కడ 18,310 జనాభా ఉంది. ఇంటింటా చెత్తసేకరణ 70 శాతం మాత్రమే సాగుతోంది. ప్రధాన రహదారి వెంట రోడ్డుకిరువైపులా, ఆకునూరు వెళ్లేదారి, అంబేద్కర్ నగర్ శివారులో చెత్త పారబోస్తుండటంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. హుస్నాబాద్ పురపాలికలో 20 వార్డులున్నాయి. 30వేల జనాభా ఉంది. ఇక్కడ ఇంటింటా 95 శాతం చెత్త సేకరిస్తున్నా దాన్ని డంపింగ్‌యార్డుకు తరలించాక 30 శాతమైనా వేరు చేయడం లేదు. పోగేసిన చెత్తను తగలబెడుతుండటంతో దట్టమైన పొగలు అలముకుంటున్నాయి. గజ్వేల్– ప్రజ్ఞాపూర్ బల్దియాలో 20 వార్డులున్నాయి. ఇక్కడ 9వేల ఇళ్లు, 55 వేల జనాభా ఉంది. నియోజకవర్గ కేంద్రం కావడంతో ఇక్కడ వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, వేడుక మందిరాలున్నాయి. నిత్యం దాదాపు 18 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 100కుపైగా కార్మికులు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఇంటింటా వాహనాల ద్వారా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేపట్టకపోవటంతో గజ్వేల్ శివారులోని తూప్రాన్ రోడ్డు, ప్రజ్ఞాపూర్‌లోని 4వ వార్డు, ముట్రాజ్‌పల్లి శివారు, రాజీవ్ రహదారి పక్కన, ప్రజ్ఞాపూర్ బస్సు డిపో సమీపంలో చెత్త పారబోస్తున్నారు. డంపింగ్ యార్డు నిర్మించినా పూర్తిస్థాయిలో చెత్తను వేరుచేయడం లేదు.

# ప్రమాదకర బావులకు రక్షణ గోడలు ఏవీ?

ముస్తాబాద్:ప్రధాన రహదారుల పక్కన ఉన్న బావులతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రోడ్డే కదా అంటూ వాహనదారులు ఇష్టారీతిన రయ్ రయ్ మంటూ వెళుతుంటారు. అయితే రోడ్ల పక్కన చెట్ల పొదల మధ్య ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు లేవు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. వాహనదారులు అదుపు తప్పితే ఊహించని ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి ప్రధాన రోడ్ల పక్కన ఉన్న బావులను గుర్తించి రక్షణ గోడల ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకున్న నాథుడు లేడు. ముస్తాబాద్ మండలంలోని గ్రామాల్లో ప్రధాన రోడ్ల పక్కనే వ్యవసాయ, నిరుపయోగంగా ఉన్న బావులు ఉన్నాయి. వాటి చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో బావుల ఆనవాళ్లు కనిపించకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ముస్తాబాద్ నుంచి మొర్రాయిపల్లె, చీకోడ్ నుంచి ముచ్చర్ల వెళ్లే రోడ్డు పక్కన, ముస్తాబాద్ నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రోడ్డులో చెట్ల పొదల మధ్య వ్యవసాయ బావులు ఉన్నాయి. అలాగే ముస్తాబాద్ నుంచిమద్దికుంట వెళ్లే రోడ్డుపక్కన, మద్దికుంట ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన,పోత్గల్ నుంచి ఆవునూర్ వెళ్లే రోడ్డుపక్కన, తెర్లుమద్ది నుంచి సేవాలాల్‌తండా మార్గంలో ఉన్న బావుల వద్ద రక్షణ గోడలను నిర్మించలేదు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. వీటితోపాటు మండలంలోని మరికొన్ని గ్రామాల్లోనూ బావులు ఉన్నాయి. వ్యవసాయ బావులైతే రక్షణ గోడలు నిర్మించుకునేలా సంబంధిత రైతులకు అవగాహన కల్పించాలి. నిరుపయోగంగా ఉన్నవి అయితే



వాటిని పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అధికారులు మాత్రం వీటిని పట్టించుకోవడం లేదు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర బావుల వద్ద అడ్డుగోడలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ప్రమాదం పొంచి ఉంది. బావుల వద్ద అడ్డుగోడలు నిర్మించలేదు. రాత్రి వేళలో మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో వాహనాలు అదుపు తప్పితే బావుల్లో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడే సంబంధిత అధికారులు ఒకటి, రెండు రోజులు హడావుడి చేస్తారు. తర్వాత వాటిని పట్టించుకోవడం లేదు. రోడ్ల పక్కన చెట్ల పొదల మధ్య ఉన్న ప్రమాదకర బావులను గుర్తించాలి. వ్యవసాయ బావులైతే సంబంధిత రైతులతో మాట్లాడి అడ్డుగోడలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి.


# మత్స్య శాఖకు మచ్చలు

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో అధికారులు మొదలు కింది స్థాయి సిబ్బంది వరకూ కొంతమంది వ్యవహార శైలితో శాఖకు అవినీతి మచ్చలు అంటుకుని వదలడం లేదు. ఇటీవలి ఏసీబీ సోదాలు, అధికారుల సస్పెన్షన్లకు కారణమైన ఘటనలకు తోడు ఇంకా శాఖలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పూర్వ ఖమ్మం జిల్లాలో మత్స్య శాఖకు వైరా డివిజన్ కీలకం. వైరా జలాశయంలో నిషేధిత సమయంలో చేపల వేటకు అనుమతి ఇచ్చే క్రమంలో సొసైటీ ప్రతినిధుల నుంచి నగదు డిమాండ్ చేసి, వారం క్రితం ఏకంగా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) బుజ్జిబాబు సస్పెండ్ అయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగి మురళీని శాశ్వతంగా తొలగించారు. కీలక అధికారి సస్పెండ్ కావడంతో ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఏడీని నియమించారు. ప్రస్తుతం వైరా కేంద్రంగా శాఖాపరంగా చేపట్టాల్సిన ముఖ్య కార్యక్రమాలున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో చేపపిల్లల ఉత్పత్తి చేసే ఏకైక కేంద్రం వైరా. ఏటా మూడు కోట్ల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యం ఉంటుంది. దీంతోపాటు కొరమీను ఉత్పత్తికి రాష్ట్ర స్థాయిలోనే ఇక్కడి కేంద్రాన్ని ఎంపిక చేశారు. గత వర్షాకాల సమయంలో ఇక్కడ కొరమీను చేపపిల్లల ఉత్పత్తి విజయవంతమైందని అధికారులు ప్రకటించారు. కానీ ఎంతమేరకు సత్ఫలితాలు ఇచ్చిందన్న విషయంలో స్పష్టత లేదు. భువనేశ్వర్‌లోని జాతీయ మంచినీటి చేపల ఉత్పత్తి కేంద్రం(సిఫా)తో ఒప్పందం చేసుకుని అక్కడ నుంచి వచ్చిన శాస్త్రవేత్తల సూచనలతో ఈ ఉత్పత్తి చేశారు. రాబోయే వర్షాకాలంలో ఈ ఉత్పత్తి మళ్లీ చేయాలి. దీనికి తోడు సాధారణ బంగారుతీగ, కట్ల, రోహు వంటి చేపపిల్లల ఉత్పత్తి సైతం చేపట్టాల్సి ఉంది. చేపపిల్లల ఉత్పత్తికి ఈసరికే అవసరమైన వనరులు, చేపల తొట్లు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలి. పూర్తి స్థాయిలో దిగుబడి సాధనకు కావాల్సిన కసరత్తు చేపట్టాలి. వైరాలో ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. సిబ్బంది



లేకపోవడంతో వసతులు కనుమరుగైనా గాడినపెట్టే వారు లేరు. ముఖ్యమైన అధికారి లేకపోవడంతో పాటు కింది స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిస్థితి చక్కబడటం లేదు. జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా సభ్యత్వాల నమోదు కోసం మత్స్యకారులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలోనూ భారీ అవకతవకలు, అవినీతిని ప్రోత్సహించే చర్యలకు ఊతమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. సొసైటీల పరిధిలో ఉన్న చేపల చెరువుల్లో చేపల వేటకు అనుమతి కోసం నగదు డిమాండ్ చేస్తున్నారు. సభ్యత్వాలు ఇచ్చేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహించాలి. ఇందుకు కూడా నగదు డిమాండ్ చేస్తున్నారు. అంతటా ఇదే పరిస్థితి. మత్స్యశాఖ పరంగా అనేక సమస్యలున్నాయి. ఇటీవల అధికారుల వేటు నేపథ్యంలో మరో అధికారిని ఇవ్వాలని కోరాం. రాబోయే సీజన్‌లో చేపల ఉత్పత్తితో పాటు కొరమీను ఉత్పత్తి కీలకంగా ఉండనుంది. కానీ వసతులు లేవు. గత సీజన్‌లో కొరమీను విజయవంతమైందని చెప్పినా ఏ స్థాయిలో ఉందో స్పష్టత లేదు. ఆరోపణలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

# విద్యుత్తు ఉత్పత్తికి సన్నాహాలు



జ్యోతినగర్:అవాంతరాలు, అనేక సవాళ్లను అధిగమించిన ఎన్టీపీసీ యాజమాన్యం తెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. ఇందులో భాగంగా రెండుమూడు రోజుల్లో 800 మెగావాట్ల 1వ యూనిట్‌ను లైటప్ చేయనున్నారు. జనవరి 7న 1వ యూనిట్‌ను లైటప్ చేసే క్రమంలో బాయిలర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. రెండు నెలల పాటు నిశితంగా అన్వేషించి సాంకేతిక లోపాలను గుర్తించి మరమ్మతులు పూర్తి చేయగలిగారు. మార్చి 10వ తేదీ లోగా 800 మెగావాట్ల 1వ యూనిట్ బాయిలర్‌ను ప్రత్యేక ఆయిల్‌తో మండించి ప్రారంభించనున్నారు. ప్రయోగాత్మకంగా ప్రారంభమైన వారం రోజుల అనంతరం బొగ్గుతో బాయిలర్‌ను నడిపించనున్నారు. బాయిలర్‌ను పూర్తి స్థాయిలో మండించిన అనంతరం టర్బైన్, జనరేటర్లను అనుసంధానం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం విద్యుత్తును ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చి కొన్ని రోజులపాటు ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం మార్చి చివరి వారంలో కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ) ప్రకటిస్తారు. దీంతో 800 మెగావాట్ల 1వ యూనిట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్తును ఉత్పత్తి దశలోకి తీసుకువస్తారు. బూడిద నిల్వ కేంద్రం పనులు 1వ, 2వ యూనిట్లకు సంబంధించి దాదాపు పూర్తయ్యాయి. ఎన్టీపీసీ జలాశయం సమీపంలో దాదాపు 200 ఎకరాల్లో బూడిద నిల్వ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ ప్రాజెక్టు ఆవరణలో దాదాపు 8 లక్షల టన్నుల బొగ్గును నిల్వ చేయటానికి బొగ్గు నిల్వ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నిర్మించారు. దీనికి అనుసంధానంగా రైల్వే లైన్‌ను పూర్తి చేయగలిగారు. ఇంధనం కోసం వినియోగించే బొగ్గు ఇప్పుడిప్పుడే సింగరేణి నుంచి నిల్వ కేంద్రానికి చేరుకుంటుంది. 1వ యూనిట్‌ను పూర్తి స్థాయిలో ఉత్పత్తి దశలోకి తీసుకురాగానే విడుదలయ్యే బూడిదను సమీపంలోని జలాశయంలో నిల్వ చేసి ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

# వైకాపా నాయకుల దౌర్జన్యం



కొత్తచెరువు,:కొత్తచెరువు మండలం ఇరగంపల్లిలో అధికార పార్టీకి చెందిన కొందరు చేదబావి పూడ్చివేయడం వివాదానికి దారి తీసింది. ఈఘటన ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జనసేన పార్టీకి చెందిన ఇద్దరు యువకులు గ్రామంలోని పూరతన చేదబావిలోని పూడికను తొలగించారు. ఇది వరకే రెండు బావులు పూడుకుపోవడంతో రానున్న ని దృష్టిలో ఉంచుకొని బావిని అందుబాటులోకి తెచ్చారు. ఉన్నపళంగా సర్పంచి భర్త జేసీబీతో బావిని పూడ్చుడానికి పూనుకు న్నారు. జనసేన పార్టీకి చెందిన గంగాధర్, చింతలప్ప అడ్డుకునే ప్రయత్నం చేశారు. వీరిపై వైకాపా నాయకులు దాడి చేశారు.

# పల్లె మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వ యోచన

ధరూరు: గ్రామీణాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం పంచాయతీల పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. ఇప్పటికే పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, వర్మీ కంపోస్టు తయారీ యూనిట్లను ఏర్పాటు చేసింది. హరితహారంలో భాగంగా వన నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె దవాఖానాలు కూడా ఏర్పాటయ్యాయి. తాజాగా ఉద్యాన, కూరగాయల పండించే రైతులకు స్వగ్రామంలో చేయూతనివ్వటం, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించటానికి కసరత్తు మొదలు పెట్టింది. పల్లె మార్కెట్ల పేరుతో ఊరూరా కూరగాయల క్రయ విక్రయ కొనుగోలు దుకాణాల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా చర్యలు చేపట్టాలని యోచిస్తుంది. ఇందుకనుగుణంగా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. మండల కేంద్రాల్లో ప్రతీ వారం సంతలు జరుగుతుంటాయి. ఇక్కడ వర్షాకాలంలో తడుస్తూ, ఎండాకాలంలో మండుటెండలోనే క్రయవిక్రయాలు చేసుకోవాల్సి ఉంటుంది. అది కూడా వారానికి ఒక రోజు మాత్రమే ఉండటంతో పండించిన కూరగాయలను మిగతా రోజుల్లో పట్టణ మార్కెట్లకు తరలించాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ కమీషన్‌దారులు చెప్పిన ధరకే విక్రయించాల్సిన దుస్థితి ఉంది. దీంతో రైతులు సరైన ధరలు లభించక నష్టపోతున్నారు. దీనికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం పల్లె మార్కెట్లను తెరపైకి తెచ్చింది.



వీటి ఏర్పాటుతో పంచాయతీలకు శాశ్వత ఆదాయం సమకూరనుంది. గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా గతంలో ఉపాధిహామీలో వీటిని ప్రతిపాదించినా అడుగు పడలేదు. కూరగాయల విక్రయాలే కాకుండా కుల వృత్తులు చేసే వారి ఉత్పత్తులు విక్రయించనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఎకరా విస్తీర్ణంలో దుకాణాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక కార్యాచరణపై త్వరలో ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం పల్లె మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనుంది.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com